RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com


STUDY ABROAD
TOP GLOBAL DESTINATIONS
Free IELTS coaching
GradsUniverse
+91 6301726400

# వుదయం

మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
46 Years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

గుంటూరు 08-05-2026 శుక్రవారం సంపుటి : 13 | సంచిక : 66 SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal Postal Regd. No. GTR/117/2025-27 Follow us on

# ఫస్ట్ కమ్.. ఫస్ట్ సర్వ్..

**ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌ల పంపిణీలో పారదర్శకత, వేగం కోసం ఇకపై ఏ ఏడాదికి ఆ ఏడాది ఫీజుల చెల్లింపు**




- విద్యా వ్యవస్థలో మార్పులకు రాష్ట్ర సర్కార్ శ్రీకారం
- విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దన్న హైకోర్టు ఆదేశాలపై నిర్ణయం
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలుకు సన్నాహాలు
- కీలక ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఎస్సీ సంక్షేమ శాఖ
- రూ. 2400 కోట్ల నిధులపై త్వరలోనే టైమ్ షెడ్యూల్ రిలీజ్...?

**హైదరాబాద్, మే 07 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర విద్యా వ్యవస్థలో మార్పులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్న ఫీ రియంబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌ల పంపిణీలో పారదర్శకత, వేగం పెంచేందుకు వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం సంక్షేమ శాఖల నోడల్ విభాగమైన ఎస్సీ సంక్షేమ శాఖ పలు కీలక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ కొత్త విధానం ప్రకారం ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అంటే ఎవరు ముందుగా దరఖాస్తు మిగతా 2లో..

## మమత రాజీనామాకు నిరాకరణ
# అసెంబ్లీ రద్దు చేసిన గవర్నర్




**వుదయం డెస్క్, మే 7:** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయడానికి నిరాకరించడంతో, పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్. రవి గురువారం రాష్ట్ర మంత్రివర్గాన్ని రద్దు చేశారు. 2021-2026 పశ్చిమ బెంగాల్ శాసనసభ అధికారికంగా రద్దయిన తర్వాత ఈ నిర్ణయం వెలువడింది, ఇది రాజ్యాంగ ప్రక్రియకు అనుగుణంగా అమలు చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, రాష్ట్ర శాసనసభ పదవీకాలం ఐదేళ్లు. 2021లో ఏర్పాటైన ప్రస్తుత శాసనసభ, 2026 వరకు కొనసాగింది.

అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి తర్వాత, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఫలితాలను ఒక కుట్రగా అభివర్ణిస్తూ రాజీనామా చేయడానికి నిరాకరించిన విషయం తెలిసిందే. కాగా, ఆమె తన నిర్ణయాన్ని మార్చుకునే అవకాశం కనిపించకపోవడంతో, గవర్నర్ ఆర్.ఎన్. రవి రాష్ట్ర మంత్రివర్గాన్ని రద్దు చేసినట్లు సమాచారం. దీంతో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం మరింత తీవ్రమై, ప్రభుత్వ ఏర్పాటు సంక్లిష్టంగా మారుతోంది. రాష్ట్ర ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైనప్పటికీ, పదవి నుంచి వైదొలగాలన్న పిలుపులను అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి బహిరంగంగా తిరస్కరించిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఎన్నికల ఫలితం ప్రజా తీర్పు కాదు, అదొక కుట్ర అని మమత ఆరోపించారు మరియు తీర్పు విశ్వసనీయతను ప్రశ్నించారు.

మంగళవారం పార్టీ నాయకులను, మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడుతూ, తాను తన రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తానని, ఒత్తిడికి లొంగిపోబోనని బెనర్జీ ఉద్ఘాటించారు. ఓటమి అనంతరం, జాతీయ స్థాయిలో ప్రతిపక్ష ఇండీ కూటమిని బలోపేతం చేయడంపై తాను ఇకపై దృష్టి సారిస్తానని మమతా బెనర్జీ తెలిపారు. అఖిల భారత కూటమి నాయకులు నాకు సంఘీభావం తెలిపేందుకు ఫోన్ చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కూడా నాతో మాట్లాడారు, అని ఆమె పేర్కొన్నారు. వీధుల్లోనే తన రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తానని కూడా ఆమె ప్రతిజ్ఞ చేశారు.

**మే 9న బీజేపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారం**

పశ్చిమ బెంగాల్‌లో తొలి బీజేపీ ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం మే 9న కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ కార్యక్రమం కోసం బహుళస్థాయి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సుమారు 4,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు భావిస్తున్నారు.

ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యమంత్రులు హాజరవుతారని భావిస్తున్నారు.

## మహిళా సంఘాలకు
# వడ్డీలేని రుణాలు పెంపు

**రూ. రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నాం**

- రుణ వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుంది
- ఈ ఏడాది వడ్డీల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తాం
- మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి నినాదంతో పాలన
- మహిళా స్వయం సహాయక బృందాలతో మంత్రి సీతక్క



**హైదరాబాద్, మే 07 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో ప్రతి మహిళా స్వయం సహాయక బృందానికి వడ్డీ లేని రుణాలు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచుతున్నట్లు రాష్ట్ర , గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. ప్రతి మహిళా సంఘం తీసుకునే రూ. 10 లక్షలు బ్యాంకు రుణాలకు వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తోందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల రుణాలకు మిగతా 2లో..

# కేటీఆర్‌పై క్రిమినల్ కేసులు

- రైతు సంగ్రామ సదస్సులో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై ఆరోపణలపై చర్యలు
- సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు




**వరంగల్, మే 07 (వుదయం ప్రతినిధి)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై వరంగల్ సుబేదారి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 6న హనుమకొండలో బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సు వేదికగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో కేటీఆర్‌పై పోలీసులు కేసు మిగతా 2లో..

# కరీంనగర్‌లో ఉద్రిక్తత

**గంగుల క్యాంప్ కార్యాలయంపై బీజేపీ శ్రేణుల దాడి**

- కౌశిక్ రెడ్డి కారు ధ్వంసం
- లాఠీచార్జి చేసి చెదరగొట్టిన పోలీసులు
- బీజేపీ-బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట
- 13 మందిపై కేసులు
- కేంద్రమంత్రి బండి వర్సెస్ కౌశిక్ రెడ్డి
- డ్రగ్స్ ఆరోపణలతో మొదలైన మాటల యుద్ధం..

**కరీంనగర్, మే 07 (వుదయం ప్రతినిధి) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ నేతల మధ్య కొనసాగుతున్న మాటల యుద్ధం ఇప్పుడు ప్రత్యక్ష ఘర్షణలకు దారితీసింది. కేటీఆర్‌పై బండి మిగతా 2లో..

# యుద్ధ ప్రాతిపదికన డిండి ఎత్తిపోతల పూర్తి



- ఎస్.ఎల్.బి.సి కాలువల సామర్థ్యాన్ని 2400 నుంచి 4000 క్యూసెక్కులకు పెంచండి
- ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల స్కీం అప్రోచ్ ఛానల్ కు నీటి తరలింపు
- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2 లో..

## ఫార్మా సిటీ రైతుల కోసం
# టీఆర్ఎస్ రణం

- ఫ్యూచర్ సిటీ పేరుతో సర్కార్ బలవంతపు భూసేకరణ
- సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇచ్చేయాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, మే 07 (వుదయం ప్రతినిధి) :** ఫార్మా సిటీ రైతుల పక్షాన రణం చేస్తామని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. వేరే పార్టీల సంగతి ఎలా ఉన్న సరే టీఆర్ఎస్ మాత్రం ఫార్మా సిటీ రైతుల కోసం ముందుండి కొట్లాడుతుందన్నారు. ప్రశ్నించటం, పోరాడటం, పరిష్కరించడం తమ విధానమని చెప్పారు. వెలుగుమట్లలో సమస్య పరిష్కరమయ్యే వరకు నిరాహార దీక్షకు కూర్చోవడంతోనే బాధితులకు న్యాయం జరిగిందన్న ఆమె మొండి ప్రభుత్వాలు దిగిరావాలంటే మిగతా 2లో..



## డ్రగ్స్ కేసులో
# పట్టుబడితే పీడీ యాక్ట్

**డ్రగ్స్ సరఫరా చేస్తోన్న వారి ఆస్తులూ సీజ్**

- డ్రగ్స్ వినియోగం కట్టడే తొలి ప్రాధాన్యం
- యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే ఆ యజమాన్యాలపై చర్యలు
- కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా డీ అడిక్షన్ సెంటర్లు
- ఈగల్ ఫోర్స్‌పై సమీక్షలో డీజీపీ సీవీ ఆనంద్



2 లో..

# భూ పరిపాలన వ్యవస్థ బలోపేతం

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాం
- గృహ విప్లవం, రెవెన్యూ సంస్కరణలతో తెలంగాణలో నవశకం
- అదనపు ఎమ్మార్వోల నియామకం
- ఏ చిన్న పొరపాటు జరిగిన ఉపేక్షించేది లేదు
- ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల సమీక్షలో మంత్రి పొంగులేటి



2 లో..

# రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా

- హైడ్రా కావాలని ప్రజల నుంచి వినతులు వస్తున్నాయి
- కబ్జాలపై హైడ్రాకు వేలాదిగా ఫిర్యాదులు
- అన్ని ఫిర్యాదులపై విచారించి చర్యలు తీసుకుంటాం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్



2 లో..

## తమిళనాడులో
# గవర్నర్ పాలన తేచ్చే కుట్ర

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్**

- ఆ రాష్ట్ర గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం
- టీవీకేకు కాంగ్రెస్ మద్దతిచ్చినా ప్రభుత్వం ఏర్పాటుకు కావాలనే జాప్యం



2 లో..





## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ

**ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సీఈవో, జిల్లా కలెక్టర్**

సంగారెడ్డి, ,మే 06 (వుదయం ప్రతినిధి): జిల్లా కేంద్రంలోని పాత డీఆర్‌డీఏ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో కలిసి గురువారం పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎంల భద్రతా ఏర్పాట్లు, గోడౌన్ నిర్వహణ, తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోడౌన్ సీళ్లను తనిఖీ చేసి, అక్కడ ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా ప్రమాణాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంప వారి సౌజన్యంతో అంబలి వితరణ



దౌల్తాబాద్, మే 7 (వుదయం):వేసవి తీవ్రత అధికంగా కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు చల్లదనాన్ని అందించేందుకు దౌల్తాబాద్‌లో అంబలి వితరణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గత మాసంలో శ్రీ బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ మాదంశెట్టి భద్రయ్య ఆధ్వర్యంలో అంబలి వితరణ కార్యక్రమం ప్రారంభమైన విషయం తెలిసిందే. అందులో భాగంగా గురువారం గంప కుటుంబ సభ్యుల సౌజన్యంతో అంబలి వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గంప మల్లేశం గుప్తా జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గంప మమత రవిగుప్త, హరిత వెంకటేష్, సంతోష్, సతీష్ తదితరులు తమ తండ్రి స్మారకార్థంగా ప్రజలకు అంబలి పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని పలువురు ప్రజలు కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యుల సేవాభావాన్ని అభినందించారు.

## ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

**బ్యాంకు అధికారులతో ఎంపిక ప్రక్రియ నిర్వహణ**



దౌల్తాబాద్,మే 7 (వుదయం):ఎస్సీ కార్పొరేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం మండల కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కింద ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అభ్యర్థులు హాజరై తమ దరఖాస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలను సమర్పించారు. బ్యాంకు అధికారులు లబ్ధిదారుల అర్హతలు, ప్రతిపాదించిన యూనిట్ల సాధ్యత, ఆర్థిక పరిస్థితులను పరిశీలిస్తూ ఇంటర్వ్యూలు నిర్వహించారు. యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావాలని, ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అఫ్జలోద్దీన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని, ఎంపికైన వారికి బ్యాంకుల ద్వారా త్వరలోనే రుణాలు మంజూరు అవుతాయని పేర్కొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మానం

## జిల్లా ప్లీనరీ సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం పిలుపు






సంగారెడ్డి ,మే 06 (వుదయం ప్రతినిధి): తెలంగాణ జన సమితి జిల్లా ప్లీనరీ సమావేశం జిల్లా అధ్యక్షుడు తుల్జా రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు . ఈ సమావేశానికి టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. ఈ స ందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కేవలం రాష్ట్ర సాధన కోసమే కాకుండా, ఆత్మగౌరవం, వనరుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం జరిగిన మహా ప్రజా పోరాటమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర ఆధిపత్య శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు ఏకమై ఉద్యమించారని గుర్తుచేశారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చకుండా, రాజ్యాంగ విలువలను బలహీనపరుస్తూ కుటుంబ పాలన కొనసాగించిందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను దెబ్బతీసి, ప్రశ్నించే స్వరాలను అణచివేసిందన్నారు. తెలంగాణలో కొత్త అభివృద్ధి నమూనా తీసుకురావాల్సిన సమయంలో కాంట్రాక్టులు, కమిషన్లు, డబ్బు రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక రాజకీయాలు అవసరమనే లక్ష్యంతోనే 2018 ఏప్రిల్ 29న తెలంగాణ జన సమితి ఏర్పాటైందని తెలిపారు. ప్రజలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వం కల్పించే ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా టీజేఎస్ పనిచేస్తోందన్నారు. కేసీఆర్ పాలనలో జరిగిన అప్రజాస్వామిక చర్యలను నిరంతరం ప్రశ్నిస్తూ, భూసేకరణ, నిరుద్యోగం, బీసీ రిజర్వేషన్లు, విద్య, వైద్యం, రైతుల సమస్యలు, సింగరేణి పరిరక్షణ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక ప్రజా సమస్యలపై పార్టీ పోరాటం కొనసాగించిందన్నారు. నిరంకుశ పాలనను ఓడించేందుకు ప్రజాస్వామ్య పరిరక్షణ దృష్ట్యా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపామని, అయితే ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం అనే లక్ష్యం ఇంకా పూర్తికాలేదన్నారు. బీజేపీ విద్వేష రాజకీయాలను రాష్ట్రంలో విస్తరించే ప్రయత్నం చేస్తోందని, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలు కొనసాగిస్తోందని విమర్శించారు. డా. బి . ర్ . అంబేద్కర్ ఇచ్చిన "చదువు ? బోధించు ? సమీకరించు ? పోరాడు" పిలుపు, తెలంగాణ జాతిపిత కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తితో ప్రజలను సంఘటితం చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. మే 12న జలవిహార్ లో నిర్వహించనున్న తెలంగాణ జన సమితి నాలుగో రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉర్దూ భాష అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందిగద్దె క్రాంతి కుమార్



విజయవాడ మే 7 వుదయం ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండవ అధికార భాష అయిన ఉర్దూపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడంతో పాటు యువతకు భాషా ప్రావీణ్యం కల్పించే లక్ష్యంతో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ రాష్ట్రవ్యాప్తంగా ఈ వేసవి సెలవుల్లో ఉచిత ఉర్దూ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం అశోక్ నగర్ లోని తూర్పు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఉర్దూ ఫ్రీ క్యాంప్‌కు సంబంధించిన పుస్తకాన్ని టీడీపీ నాయకులు గద్దె క్రాంతి కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఉర్దూ భాషకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక స్థానం ఉందని, భాషల పరిరక్షణ మరియు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.
ఉర్దూ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత ఈ ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ సిబ్బంది,
మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు..

# కరీంనగర్ నగర అభివృద్ధికి మహర్దశ.

**మేయర్ అధ్యక్షతన ప్రశాంతంగా ముగిన అత్యవసర సర్వ సభ్య సమావేశం.**

**1150 కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ప్రతిపాధనల ఎజెండా కు పాలకవర్గం ఏకగ్రీవ ఆమోదం.**



కరీంనగర్ మే 7(వుదయం ప్రతినిధి) : నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా కరీంనగర్ నగరపాలక సంస్థ అడుగులు వేస్తోంది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సమక్షంలో గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో అత్యవసర సర్వ సభ్య సమావేశం జరిగింది. నగర అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాగస్వామ్యంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' పథకం కింద 1,150 కోట్ల నిధుల వినియోగంపై రూపొందించనున్న ప్రతిపాదనలకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. ఈ పథకం ద్వారా నగరంలో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టుల ప్రతిపాదనల రూపకల్పనపై పాలకవర్గ సభ్యుల సలహాలు సూచనలు స్వీకరించి ప్రాజెక్టులపై సుధీర్ఘంగా చర్చించి ప్రభుత్వానికి పంపె నివేదికలకు తీర్మాణం చేశారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుండి భారీగా నిధులు సాధించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ పథకం ఒక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో ఈ నిధులను సాధించుకొని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగర ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపట్టబోయే ప్రతి ప్రాజెక్టు పారదర్శకంగా, నాణ్యతతో సాగేలా చూస్తామని సమావేశంలో తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల మెరుగుదలకు పాలకవర్గ సభ్యులు ఇచ్చే సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ పథకాన్ని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ త్వరలో ప్రకటించడంతో ఈ పథకంలో కరీంనగర్ నగరపాలక సంస్థను చేర్చేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 1150 కోట్ల నిధులతో నగరాన్ని మరింత సుంధరంగా అభివృద్ధి చేసి విలీన గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్ నగర అభివృద్ధి కి పాలకవర్గ సహాకారం ఎంతో అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, ఎస్.ఈ రాజకుమార్, ఈఈ సంజీవ్ కుమార్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



కరీంనగర్ మే 7(వుదయం ప్రతినిధి) : కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదానీను గురువారం అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదానీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవియం గదుల వి వి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.
ఈ కార్యక్రమంలొ ఏ.వో సుధాకర్, తహసిల్దార్ నరేందర్, బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, ఎంఐఎం పార్టీ ప్రతినిది మహ్మద్ మజీద్ హుమైన్, సయ్యద్ ఇబ్రహీం, టిడిపి పార్టీ ప్రతినిది ఎర్రవెల్లి వినీత్, సిపియం పార్టీ ప్రతినిధి నరేష్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో శిశు గృహ, సఖి కేంద్రాల ఆకస్మిక తనిఖీ






సంగారెడ్డి ,మే 06 (వుదయం ప్రతినిధి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. భవానిచంద్ర గారి ఆదేశాల ప్రకారం ఈ రోజు శిశు గృహ; జువైనల్ జస్టిస్ బోర్డు మరియు సఖి కేంద్రం నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు తనికి నిర్వహించటం జరిగినది. ఈ తనికి లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి. సౌజన్య గారు మాట్లాడుతూ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి సంరక్షణను తోడ్పడాలని అన్నారు. అందరు క్రమశిక్షణగా ఉండాలి అన్నారు. అదేవిదంగా వారి యొక్క బాగోగులను కూడా చూడాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి అని తేలిపారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించండి అన్నారు. సఖి కేంద్రాన్ని సందర్శించే బాధితుల యొక్క సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డ్ నందు బాలల హక్కుల రక్షణ చట్టం పై అవగాహన కల్పించారు. ఎవరికైనా న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి బి.సౌజన్య గారు మరియు సఖి, శిశు గృహ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దళితులను అడ్డుకున్న వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్**



దౌల్తాబాద్ , మే 7 (వుదయం): సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో దుర్గమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా దళితులను దేవాలయంలోకి రాకుండా అడ్డుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర అమృత మహోత్సవాలు జరుపుకుంటున్న ఈ సమయంలో కూడా దళితులను కులం పేరుతో అవమానించడం దురదృష్టకరమన్నారు. ఆధునిక సమాజంలో కుల, మత భేదాలు లేవని చెప్పుకుంటున్నప్పటికీ అనంతసాగర్‌లో జరిగిన ఘటన సమాజానికి చెడు సంకేతాలు ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గమ్మ ఉత్సవాల నిర్వహణకు దళితులు కూడా విరాళాలు అందించినప్పటికీ, వారి బోనాలను దేవాలయంలోకి తీసుకెళ్లకుండా అడ్డుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ ఘటనలో అనంతసాగర్ ఉపసర్పంచ్ కనకయ్యతో పాటు బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బాధిత దళిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని, పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఇంటర్ బోర్డు విలీనంపై ప్రభుత్వం పునరాలోచించాలి

ఎకనామిక్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల తిరుమల్ మంథని


**మే 07 వుదయం**



తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డును విద్యాశాఖలో విలీనం చేసే అంశంపై ప్రభుత్వం ఒక్కసారి పునరాలోచన చేయాలని తెలంగాణ ఎకనామిక్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావుల తిరుమల్ ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యేకంగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ బోర్డును విలీనం చేయడం వల్ల విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక బోర్డు ఉండటం వల్లనే జాతీయ స్థాయి పరీక్షల్లో తెలుగు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఈ మార్పుల వల్ల అటు విద్యార్థులు, ఇటు ఇంటర్ వ్యవస్థ లో పని చేస్తున్న అధ్యాపకులు, ప్రిన్సిపాల్లు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతారన్నారు.ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియకు షెడ్యూల్ ప్రకటించిన బోర్డు వెంటనే దానిని రద్దు చేయడం తగదన్నారు. పాఠశాలల్లో కళాశాలలను విలీనం చేయడం వల్ల అనేక రకాల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని విలీనం పై మరోసారి మేధావులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ రఘు

**మెట్ పల్లి మే 06 (వుదయం విలేఖరి)**



కోరుట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బుధవారం జరిగిన పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన నిత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ చిట్నేని రఘు ఈ సందర్భంగా కోరుట్ల పట్టణ జీఎస్ గార్డెన్లో ఖానాపూర్ లక్ష్మి నర్సయ్యగౌడ్ ల కుమారుడు శ్రీనాథ్ గౌడ్ – మధులిక వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు అనంతరం నల్ల తిరుపతి రెడ్డి కుమార్తె వివాహం కోరుట్ల పట్టణ ముక్కాస్ ఫంక్షన్ హాల్లో జరగగా ఇట్టి వివాహ వేడుక ల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు అనంతరం తొగిటి లక్ష్మీ అంజయ్య ల కుమారుడు వినయ్ గౌతం – హర్షిత ల వివాహం మెట్ పల్లి పట్టణ వీఆర్ఎమ్ గార్డెన్ లో జరగగా ఇట్టి వివా హ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిట్నేని రఘు తో పాటు నాయకులు అజార్ భాయ్ రేండ్ల రాజన్న చెట్లపల్లి దేవేందర్ గౌడ్ మెడిచెల్మెల నాని పసుల శివ కుమార్ సోమిడి ప్రశాంత్ దేశెట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీరయ్య కళ్యాణ మహోత్సవం...



**కోరుట్ల మే 06 (వుదయం ప్రతినిధి)**

మల్లాపూర్ మండలంలో బుధవారం బీరయ్య టెంపుల్ లో నిర్వహించిన బీరయ్య కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తెలంగాణ రాష్ట్ర వేలమ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ బీరయ్య కృపా కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు తోపాటు మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వన తడపడ పుష్పలత నర్సయ్య వివిధ గ్రామాల సర్పంచ్లు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగున్నరేళ్ల సేవలకు ముగింపు

### సదాశివనగర్‌కు బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ సి.వి. మనోహర్‌రావు

**నాగిరెడ్డిపేట్, వుదయం**



నాగిరెడ్డిపేట మండల పోలీస్ స్టేషన్‌లో నాలుగున్నర సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ సి.వి. మనోహర్ రావు (HC 127) సాధారణ బదిలీలలో భాగంగా కామారెడ్డి జిల్లా సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి పేట పోలీస్ స్టేషన్‌లో ఆయనకు ఘన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ భార్గవ్ గౌడ్ శాలువాతో సన్మానించి, మనోహర్‌రావు సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సి.వి. మనోహర్‌రావు మాట్లాడుతూ నాగిరెడ్డి పేట పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహించే సమయంలో తనకు సహకరించిన అధికారులు, సహచర సిబ్బంది, మండల ప్రజలు మరియు మీడియా ప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సహకారంతోనే తాను సమర్థవంతంగా విధులు నిర్వహించగలిగానని పేర్కొన్నారు.

## ప్రజలంతా జన గణనకు సహకరించాలి...

### -మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్

**మంచిర్యాల/రామకృష్ణాపూర్ 07(వుదయం ప్రతినిధి)**



భారత జనగణన లో భాగంగా ఈనెల 11వ తేదీ నుండి వచ్చే నెల 9 తేదీ వరకు మొదటి దశ కింద ఇండ్ల జాబితా, ఇండ్ల ఘనన సమాచార సేకరణ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ప్రజలంతా సహకరించాలని క్యాతనపల్లి మున్సిపాలిటీ కమిషనర్ మారుతి ప్రసాద్ కోరారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలంతా వారి ఇండ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు సహకరించాలని 44 ప్రశ్నలకు సరైన సమాచారం అందించి జనగణనకు సహకరించాలని కమిషనర్ కోరారు. ప్రభుత్వ గుర్తింపు కార్డులతో ఎన్యుమరేటర్లు వస్తారని వారికి ప్రజలంతా సహకరించాలని జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

## షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైన పంట...

**కోరుట్ల మే 06 (వుదయం ప్రతినిధి)**



మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి పంట దగ్ధ మవ్వగా సంఘటన స్థలాన్ని బుధవారం కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు వేంపల్లి గ్రామానికి చెందిన గుమ్ముల లత అనే రైతు యొక్క పండించిన పంటను కోసి కుప్పగా పోసి ఉంచగా మంగళవారం షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది స్థానిక రైతులు గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ పంట పూర్తిగా కాలిపోయింది చేతికొచ్చిన పంట కళ్ల ముందే నష్టపోయిందని బాధితురాలు కన్నీటి పర్యంతమైంది.

# దివ్యాంగులకు అండగా ఉంటాం..జిల్లా కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల, మే -07**



దివ్యాంగులకు అండగా ఉంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భరోసా ఇచ్చారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్ సీఎస్ఆర్ కింద దివ్యాంగులకు రూ. 83 లక్షల విలువైన 813 ఉపకరణాలు అందించగా, జిల్లా సంక్షేమ శాఖ ఆద్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సినారే కళామందిరంలో గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్స్, సుగమ్య కేన్, స్మార్ట్ ఫోన్, ఇతర పరికరాలు అందజేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందని, దివ్యాంగుల కోసం రూ. 1600 కోట్లు వెచ్చిందని తెలిపారు. దివ్యాంగులకు ఇప్పటికే సహాయ పరికరాలు ఇచ్చామని, భవిష్యత్తులో అర్హులందరికీ ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఎంతో మంది దివ్యాంగులు ఆత్మ స్థైర్యం, మనోధైర్యంతో ఎందరో జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. దివ్యాంగులకు అందరూ మద్దతుగా ఉండాలని, వారిలో స్ఫూర్తి నింపాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం ఇస్తున్నామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలని, డ్రాప్ ఔట్ ఉండవద్దని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ మేరకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది కూడా సైకిల్ లు ఇస్తామని, ఈ ఏడాది 15 వేలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దివ్యాంగులు సంక్షేమానికి కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులకు అభినందనలు తెలియజేశారు.ఉపకరణాలతో మరింత ముందుకు వెళ్లాలి. శిబిరంలో పంపిణీ చేసే ఉపకరణాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకొని మరింత ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. సుగమ్య భారత్ ... స్వశక్త భారత్ లో భాగంగా దేశ నిర్మాణం, అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు జిల్లాలో ఆరు శిబిరాలు ఏర్పాటు చేశామని, వైద్య పరీక్షలు చేయించి అర్హులను గుర్తించామని తెలిపారు. ఈ ఉప కరణాలతో దివ్యాంగులకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ లో 10 మంది దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో యూ డీ ఐ డీ కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని, వైకల్య నిర్ధారణ పరీక్షలు ప్రతి నెలా చేయిస్తున్నామని తెలిపారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం...


**కోరుట్ల మే 06 (వుదయం ప్రతినిధి)**



కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇల్లు లేని ప్రతి ఒక్కరూ సొంతింటి నిర్మాణం చేపట్టుకోవాలని సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడం జరిగిందని ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ పత్రం ద్వారా కోరుట్ల పట్టణ 14వ వార్డు చెందిన గుండేటి మేఘన రమేష్ 13 వ వాడుకు చెందిన బైరి శారద గంగాధర్ 18 వ వార్డుకు చెందిన దాసరి లక్ష్మి లు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపట్టుకొని బుధవారం ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశ వేడుకలు చేపట్టారు ఇట్టి వేడుకలకు స్థానిక అవార్డు కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లు పాల్గొని రిబ్బన్ కట్ చేసి నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల అభివృద్ధి సంక్షేమమే దేహంగా అహర్నిశల కృషి చేస్తుందని అందులో భాగంగానే ఇల్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇంటి ప్రొసిడింగ్ పత్రాలు అందజేయడం జరిగిందని ప్రొసిడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరు కూడా ఇంటి నిర్మాణాలు త్వరగా చేపట్టుకోవాలని ఇంటి నిర్మాణం ఏ విధంగా జరిగితే ఆ విధంగా ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బులు జమవుతాయని కావున ప్రొసీడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ కూడా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం త్వరగా చేపట్టుకోవాలని సూచించారు అలాగే ఇంకా ఎవరైనా ఇల్లు రానివారు అర్హులు ఉంటే త్వరలోనే వారందరికీ కూడా అందజేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ తో పాటు రేంజర్ల కళ్యాణి దండవేణి వెంకటేష్ రహీం ధనని లక్ష్మణ్ రహీం నూతన ఇందిర మా ఇంటి గృహప్రవేశ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య

**జన్నారం, మే 7(వుదయం విలేఖరి)**



చదువుకోమని తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెందిన డిగ్రీ విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని రోటిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి..రోటిగూడ గ్రామానికి చెందిన మోత్కూరి లక్ష్మీనారాయణ గౌడ్ (53) కుమార్తె మోత్కూరి అక్షయ (19) లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ప్రస్తుతం వార్షిక పరీక్షలు జరుగుతున్నాయి. అక్షయ ఇంట్లో తరచూ టీవీ చూస్తూ ఉండేది.ఫస్ట్ సెమిస్టర్‌లో మార్కులు తక్కువ రావడంతో తల్లిదండ్రులు చదువుకోమని సూచించారు.ఈ క్రమంలో మే 3వ తేదీ ఉదయం 9:30 గంటలకు పనికి వెళ్లే ముందు తల్లిదండ్రులు "పరీక్షలు జరుగుతున్నాయి, టీవీ చూడకుండా పుస్తకం పట్టి చదువుకో. నేను, అమ్మ కూలి పనులు చేసి కష్టపడుతున్నాం" అని మందలించి టీవీ ఆఫ్ చేసి వెళ్లారు.వారు వెళ్లిన కాసేపటికి అక్షయ మనస్తాపంతో ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకొని గదిలో పంటకు కొట్టే గడ్డి మందు తాగింది. బయటకు వచ్చి వాంతులు చేసుకుంటుండగా చూసిన నాయనమ్మ లక్ష్మి, పక్కనే ఉన్న బాబాయి మోత్కూరి శ్రీనివాస్‌కు తెలిపింది. వెంటనే తండ్రి లక్ష్మీనారాయణకు ఫోన్ చేశారు.తండ్రి, బాబాయి ఇద్దరూ అక్షయను జన్నారంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుండి కరీంనగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున 3:55 గంటలకు అక్షయ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.మృతురాలి తండ్రి లక్ష్మీనారాయణ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జన్నారం ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం...

### నూతన వస్త్రాలను అందజేసిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు

**కోరుట్ల మే 06 (వుదయం ప్రతినిధి)**



మల్లాపూర్ మండల కేంద్రంలో నాగుల వినోద్ కు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని బుధవారం గృహప్రవేశం చేపట్టగా 50 గృహప్రవేశ వేడుకలకు స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పలత నర్సయ్య లతో కలిసి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసి నూతన వస్త్రాలను అందజేసిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తెలంగాణ రాష్ట్ర వేలమ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు అనంతరం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా నెరవేరని పేద మధ్యతరగతి ప్రజల కళా సహకారం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో బిఆర్ఎస్ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడి పెద్దపెద్ద భవంతులు కట్టుకున్నారన్నారే తప్ప పేద ప్రజల అభివృద్ధి గురించి ఏనాడు ఆలోచించలేదని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన విధానంతో ప్రతి పేదవారికి సొంత ఇంటికాడ నెరవేర్చాలని సంకల్పంతో రాష్ట్రంలో ప్రతి మహిళకు పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద మధ్యతరగతి ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇల్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ప్రొసిడింగ్ పత్రాలుఅందజేయడంజరిగిందని ప్రోసిడింగ్ పత్రాలు తీసుకున్న ప్రతి ఒక్కరు ఇంటి నిర్మాణాలు త్వర గా చేపట్టుకోవాలని సూచించారు.

## మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం సందర్శన...

### ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

**కోరుట్ల మే 06 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల పట్టణ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కోరుట్ల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరిశీలించారు మొక్కజొన్న కొనుగోలు విషయంలో గత నాలుగు వారాలుగా తీవ్ర జాప్యం జరుగుతుండటపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు తమ గోడును వెల్లడించారు కొనుగోలు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని మార్క్ఫెడ్ డిఎం కు ఫోన్ చేసి కోరారు. ఈప్రభుత్వాన్ని ఒకటేకోరుతున్నాం రైతుల గోస వినండి పెట్టుబడి సాయం ఇవ్వలేరు సకాలంలో యూరియా ఇవ్వలేరు కొనుగోలు త్వరగా చేపట్టాలని కోరుతున్నాం. రైతులు అప్పుచేసి పంటలు పండిస్తే దాన్ని కొనకపోతే ఎలా అని ప్రశ్నించారు మీడియా మేనేజ్మెంట్ వాడిది గ్రౌండ్లోకి వచ్చి రైతు సమస్యలు తెలుసు కోండి అంటూ డిమాండ్ చేశారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ ను సన్మానించిన జిల్లా గోపా నేతలు



**కోరుట్ల మే 06 (వుదయం ప్రతినిధి)**

గోపాల్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో గౌడ ముద్దుబిడ్డ కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లను ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా గోపా అధ్యక్షులు దుర్గా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ గౌడులు అన్ని రంగాల్లో ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య గౌడ్ కోశాధికారి గుర్రం సత్యనారాయణ గౌడ్ ఉపాధ్యక్షులు సత్తయ్య గౌడ్ తిరుమల సదాశివ గౌడ్ వెంకటేశ్వర్ గౌడ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గొల్లపల్లి రాజు గౌడ్ కోరుట్ల గోపాల్ అధ్యక్షులు గాడి పల్లి ఆంజనేయులు గౌడ్, జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి సింగం మహేష్ గౌడ్ సాయి కృష్ణ గౌడ్ సత్యనారాయణ గౌడ్ రాజ వర్ధన్ గౌడ్ గంగాధర్ గౌడ్ గంగాధరి రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో డాక్టర్ చిట్నేని రఘు



**మెట్ పల్లి మే 06 (వుదయం విలేఖరి)**

కొల్లాపూర్ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన పల్లం నరేష్ నూతన గృహప్రవేశ వేడుకలు బుధవారం నిర్వహించగా ఇట్టి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న నిత్య సాయి టేబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ విద్యాసాగర్ డాక్టర్ మాధవి లు పాల్గొన్నారు ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు నూతన గృహప్రవేశం సందర్భంగా పల్లెం నరేష్ను డాక్టర్ చిట్నేని రఘు అభినందించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ చిట్నేని రఘు తో పాటు ఆజార్బాయ్ రేండ్ల రాజన్న పశువుల శివకుమార్ చెట్లపల్లి దేవేందర్ గౌడ్ మేడిచేల్మెల నాని సోమిరెడ్డి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ చైర్మన్ నర్సింలుకు ఘన సన్మానం చేసిన మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి



**నాగిరెడ్డిపేట్, వుదయం:**

నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్తుమ్మెద ప్రాథమిక సహకార సంఘం (PACS) చైర్మన్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరించిన నర్సింలును మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి అభినందనలు తెలియజేస్తూ ఆయనకు శుభాకాంక్షలు అందించారు.గతంలో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 19న సింగిల్ విండో పాలకవర్గాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు సింగిల్ విండో చైర్మన్లు హైకోర్టును ఆశ్రయించగా, పాత పాలకవర్గాలకే తిరిగి బాధ్యతలు అప్పగించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది.దీంతో జిల్లా సహకార సంఘాధికారి రామ్మోహన్‌రావు ఆదేశాల మేరకు బుధవారం మాల్తుమ్మెద ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ నర్సింలుతో పాటు పాలకవర్గ సభ్యులు తిరిగి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, సహకార సంఘాల అభివృద్ధికి నర్సింలు సమర్థంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన నూతన జిల్లా అటవీ అధికారి

**కామారెడ్డి, మే 7 (వుదయం ప్రతినిధి):**

ఆసిఫాబాద్ జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి బదిలీపై కామారెడ్డి జిల్లా అటవీ శాఖ అధికారిగా నియమితులైన నీరజ్ కుమార్ టిబ్రీవల్ గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలో అటవీ సంరక్షణ, వనమహోత్సవ కార్యక్రమాల నిర్వహణ, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి...

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత

**జగిత్యాల మే 06 (వుదయం ప్రతినిధి)**



రాయికల్ మండలంలోని అయోధ్య మైతపూర్ మేడిపెల్లి మండలంలోని కల్వకోట కొండాపూర్ భీమారం మండల కేంద్రం తో పాటు భీమారం మండలం మన్నెగూడెం లింగం పేట గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత ఆకస్మికంగా పరిశీలించారు ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు అలాగే ట్రక్ షీట్ నమోదు ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది కేంద్రల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## జువ్వాడి నర్సింగరావుకు శుభాకాంక్షలు: మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్

**కోరుట్ల మే 06 (వుదయం ప్రతినిధి)**



తెలంగాణ రాష్ట్ర వేలమ సంక్షేమ శాఖ కార్పొరేషన్ చైర్మన్ గా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు బుధవారం ఎన్నికయ్యారు ఈ సందర్భంగా కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ లు మెట్పల్లి పట్టణ జువ్వాడి నర్సింగరావు స్వగృహం జువ్వాడి భవన్లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్తో పాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మెట్పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షులు అల్లూరి మహేందర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ శంకర్ జమున అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు కాటన్ టవల్స్ పంపిణీ...

**కోరుట్ల మే 06 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కమిషనర్ శ్రీనివాస రావు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఎండ దెబ్బ తగలకుండా ఉండటానికి నెత్తికి ఎండ తగలకుండా ఉండేందుకు కాటన్ టవాల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంతా గంగాధర్ కమిషనర్ శ్రీనివాసరావుడు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పారిశుధ్య కార్మికులు వాటర్ సప్లై ఎలక్ట్రికల్ కార్మికులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ తమ విధులను నిర్వహించాలని సూచించారు. అలాగే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ తో పాటు కమిషనర్ శ్రీనివాసరావు సానిటరీ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## 'యూరియా వాడకాన్ని తగ్గించు - భూసారాన్ని పెంచు': కలమడుగులో రైతులకు శాస్త్రవేత్తల అవగాహన



**జన్నారం, మే, 7(వుదయం విలేఖరి)**

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని కలమడుగు గ్రామంలో బుధవారం పర్యటించారు. రాబోవు వానాకాలం సాగుకు రైతులను సన్నద్ధం చేసే లక్ష్యంతో 'యూరియా వాడకాన్ని తగ్గించు - భూసారాన్ని పెంచు' అనే అంశంపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయం, ఎరువుల వాడకం, ముఖ్యంగా నత్రజని ఎరువుల వాడకం తగ్గింపు అధిక యూరియా వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని, పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువుల వాడకంతో నేలలో సూక్ష్మ పోషకాలు పెరిగి భూసారం మెరుగుపడుతుందని సూచించారు.
చౌడు నేలలను సరిచేసుకునే పద్ధతులను వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి దివ్య, సర్పంచ్ బొంతల నాగమణి మల్లేష్ మరియు 50 మంది ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా 20వ వార్షికోత్సవ వేడుకలు..

**మంచిర్యాల/రామకృష్ణాపూర్ మే 07 (వుదయం ప్రతినిధి)**



క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఏ–జోన్ రామాలయం చౌరస్తాలో వేంచేసి ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 20 వ సంవత్సర వార్షికోత్సవ వేడుకలు ఆలయ పండితులు కిరణ్ కుమార్ వేద పండితులు పురుషోత్తం ఆధ్వర్యంలో ప్రాతఃకాలం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినారు. ప్రతి సంవత్సరం నిర్వహించే అన్నప్రసాదం వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్ డాక్టర్ సంధ్యా రాణి – రాజా రమేష్ దంపతులు హాజరై అభయ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. సమాజంలో అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు మానవత్వానికి ప్రతీకలని, ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ సంధ్యా రాణి – రాజా రమేష్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, 1వ వార్డు కౌన్సిలర్ కొడగొని సాంబయ్య, పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్లు శశికుమార్, స్వర్ణలత, సీపీఐ జిల్లా నాయకులు రామడుగు లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు మహంకాళి శ్రీనివాస్, ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ పోగుల మల్లయ్య, బత్తిని రవి,సందే సదానందం, ముక్తి శ్రీనివాస్, పులి శ్రీనివాస్, రాస సంపత్ సుమన్, మేకల కుమార్, గాజుల శంకర్, కోలా శ్రీనివాస్, బాలు,పిల్లి సతీష్,ఆశవేణి సత్యం, ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.



“టీవీకే పార్టీకి దాదాపు మెజారిటీ వచ్చినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వడంలో గవర్నర్ ఎందుకు వెనుకడుగు వేస్తున్నారు? ప్రజల తీర్పుకు గౌరవం ఎక్కడ? రాజ్యాంగ హక్కులు రాజకీయ నాయకులకు మాత్రమే కాదు, ప్రజలకు కూడా తెలుసు. 2017 18లో గోవా, మణిపూర్, మేఘాలయ, కర్ణాటకలో జరిగిన పరిణామాలు గుర్తు చేసుకోవాలి. అప్పట్లో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇచ్చి, తర్వాత అసెంబ్లీలో ఫ్లోర్ టెస్ట్ నిర్వహించారు. అదే విధంగా ఇప్పుడు తమిళనాడులో కూడా టీవీకే అధినేత విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలి. విజయ్ తప్పకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తారు నేను కూడా అదే కోరుకుంటున్నాను.”

**- విశాల్, నటుడు**

## వే'మన' పద్యం



**మగనికాలమందు మగువ కష్టించిన**
**సుతుల కాలమందు సుఖమునందు,**
**కలిమిలేమి రెండు గల వెంతవారికీ**
**విశ్వదాభిరామ వినురవేమ**

## సంపాదకీయం

# ద్విపక్ష వ్యవస్థ దిశగా

ఇటీవలే వెలువడిన ఎన్నికల ఫలితాలను సరళంగా చూడటం సరికాదు. అంతర్లీనంగా అవి భారత రాజకీయాల భవిష్యత్తుఎలా ఉండనుందో మార్గాన్ని చూపాయి. నిశితంగా ఫలితాలను, తర్వాతి పరిణామాలను గమనించినప్పుడు, ఆ భవిష్యత్తు, కొంత అసమానంగా ఉన్నప్పటికీ, స్థిరంగా ఒక ద్విధృవ, రెండుపార్టీల వ్యవస్థ దిశగా పయనిస్తోంది. స్థూలంగా చెప్పాలంటే, ఫలితాలు ఆశించిన రీతిలోనే వచ్చినప్పటికీ, విజయాల స్థాయి, పరాజయాల తీవ్రత విశేషంగా ఉన్నాయి. ఇది కేవలం సాధారణ ఎన్నికల మార్పులను కాకుండా, వ్యవస్థాగతమైన పరివర్తనలను సూచిస్తోంది. ఈ పరివర్తనకు కేంద్రబిందువుగా భారతీయ జనతా పార్టీ నిలుస్తోంది. అధికార వ్యతిరేకత అనే సాంప్రదాయ శాపానికి ఈ పార్టీ క్రమంగా అతీతంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఆ పార్టీ గానీ, దాని మిత్రపక్షాలు గానీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో, ఓటర్లు మార్పు కన్నా కొనసాగింపునే ఎంచుకున్నారు. నిరంతర అసంతృప్తితో దీర్ఘకాలంగా నిర్వచితమైన రాజకీయ సంస్కృతిలో ఇది ఆశ్చర్యాన్ని కలిగించే అంశం.

ఈ సారి ఎన్నికలలో అస్సాం రాజకీయ ఏకీకరణను ప్రదర్శించగా, పశ్చిమ బెంగాల్ అధికార వ్యతిరేకత ప్రభావాన్ని కళ్లకు కట్టింది. బీజేపీ సాధించిన 45.84 శాతం ఓట్లకు దీటుగా 40.8 శాతం ఓట్లను దక్కించుకున్న మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని ఒక రాజకీయ భూకంపంగా పరిగణించవచ్చు.

293 మంది సభ్యులున్న సభలో బీజేపీ 207 సీట్లు గెలుచుకోవడం వారి సొంత అంచనాలను కూడా మించిపోయింది. భారీ స్థాయిలో పారామిలిటరీ బలగాలను మోహరించడం, లక్షలాది మంది ఓటు హక్కును కోల్పోయారన్న వార్తలను తేలికగా కొట్టిపారేయలేనప్పటికీ, ఓటమి తీవ్రతను అవి పూర్తిగా వివరించలేవు. ప్రభుత్వ వ్యతిరేకత, దానికి తోడు బీజేపీ నిరంతరం ఇస్తున్న అభివృద్ధి వాగ్దానాలే ఈ ఫలితాలకు కారణమైనట్లు కనిపిస్తోంది. ప్రతిపక్షాల ఐక్యత, లేదా దాని లోపమే, ఫలితాన్ని నిర్ధారించే ప్రధాన అంశం అనే విషయాన్ని ఇది మరింత బలపరుస్తోంది.


తమిళనాడులో అనూహ్యంగా టివికె అధినేత విజయ్ 108 స్థానాలు గెలుచుకొని స్థిరపడిన పార్టీలను, విశ్లేషకులను దిగ్భ్రాంతికి లోను చేసిందన్నది వాస్తవం. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు 75 స్థానాలు ఇస్తానన్నప్పటికీ, కాంగ్రెస్ ఆమోదించకపోవడం ఒక తప్పిదం. అయితే, ఫలితాల అనంతరం అతనికి మద్దతు ప్రకటించి దాన్ని సరిదిద్దుకుంటోంది. డిఎంకె పనితీరు మరీ అంత దారుణంగా లేనప్పటికీ అది ఓటమి పాలు కావడాన్ని గమనిస్తే కేవలం పనితీరు మాత్రమే తిరిగి ఎన్నికవడానికి హామీ ఇవ్వదని అర్థమవుతోంది. పనితీరు ఎంత ముఖ్యమో, అంతకంటే ఎక్కువగా కూటములు, కథనాన్ని తమ నియంత్రణలో ఉంచుకోవడం కూడా ముఖ్యమనే విషయం రుజువవుతోంది. కేరళలో కూడా రాజకీయ పెను మార్పు చోటుచేసుకుంది. సీపీఐ(ఎం) నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్‌పై కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఒక ఎన్నికల సునామీలా అధికారాన్ని కైవసం చేసుకుంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఇది కేవలం ఓటమి మాత్రమే కాదు, విమర్శకులు పినరయిజం అని పిలిచే పాలన శైలి తిరస్కారం. ఈ ఓటమితో, సీపీఐ(ఎం) ఏ రాష్ట్రంలోనూ అధికారంలో లేని పరిస్థితి వచ్చింది. ఈ ఓటమితో, ఒకప్పుడు జాతీయ చర్చలను ప్రభావితం చేసిన సీపీఐ(ఎం) పతనం పట్టి చూపినట్టుగా కనిపిస్తుంది.

పుదుచ్చేరిలో కథ భిన్నంగా ఉన్నప్పటికీ, అంతే గుణపాఠం నేర్పింది. సంస్థాగత బలహీనతపై ఎన్. రంగస్వామి వ్యక్తిగత ఆకర్షణ మరోసారి విజయం సాధించింది. కాంగ్రెస్, డీఎంకెలు ఐక్యంగా ముందుకు సాగడంలో విఫలమవడంతో, విచ్ఛిన్నమైన ప్రతిపక్షాన్ని సద్వినియోగం చేసుకుని, ఆయన ఐదవసారి అధికారాన్ని దక్కించుకున్నారు. బీజేపీ కేవలం సహాయక పాత్ర పోషించినప్పటికీ, తన ప్రత్యర్థుల మధ్య ఉన్న విభేదాల నుండి పరోక్షంగా లబ్ధి పొందింది.

ఈ ఫలితాలన్నీ కలిసి ఒక విస్తృత జాతీయ ధోరణిని సూచిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలు క్రమంగా క్షీణించడం, మరింత ధృవీకృత రాజకీయ వాతావరణం ఆవిర్భవించడం. దీని అర్థం భారతదేశం పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాల తరహాలో కఠినమైన ద్విపక్ష వ్యవస్థ వైపు పయనిస్తోందని కాదు. దేశ సామాజిక, భాషా వైవిధ్యం అటువంటి ఫలితం సంభవించే అవకాశం అసంభవం చేస్తుంది. అయితే, స్పష్టంగా రూపుదిద్దుకుంటున్నది మాత్రం ఒక ద్విధ్రువ పోటీ. ఒకవైపు బీజేపీ, మరోవైపు ఇంకా రూపుదిద్దుకుంటున్న, తరచుగా ఐక్యత లోపించిన ప్రతిపక్షం. దీని పర్యవసానాలు అత్యంత లోతైనవిగా ఉంటాయన్నది నిర్వివాదం.

ద్విధ్రువ వ్యవస్థ స్పష్టతను, స్థిరత్వాన్ని తీసుకురాగలదు, కానీ అది విభేదాలను మరింత తీవ్రతరం చేసే, సూక్ష్మమైన రాజకీయ చర్చలకు ఆస్కారాన్ని తగ్గించే ప్రమాదాన్ని కూడా కలిగి ఉంటుంది. ప్రతిపక్షానికి దీని నుండి నేర్చుకోవాల్సిన గుణపాఠం స్పష్టంగా ఉంది. ఐక్యత అనేది ఇకపై ఐచ్ఛికం కాదు. కాగా, ఎన్నికలలో సాధించిన ఆధిపత్యాన్ని, తమకు ఓటు వేయని వారి ఆకాంక్షలను కూడా నెరవేర్చే సమ్మిళిత పాలనగా మార్చడమే బిజెపి ముందున్న సవాలు.

## రచనలు పంపండి



ఉదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# విజయ్ సర్కార్‌కు అవకాశం ఇవ్వడమే రైట్

ఈ సారి జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఫలితాలే కాదు, ఎన్నికలానంతరం చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా నాటకీయంగా ఉన్నాయి. తమిళనాడు విషయానికి వస్తే తమిళగ వెట్రి కజగం (టివికె) అధినేత సి జోసెఫ్ విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినప్పటికీ, మెజారిటీ రుజువు చేసుకోమని గవర్నర్ తిప్పి పంపడంతో హైడ్రామా నెలకొంది. గవర్నర్ ఆయన ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతును పొంది, ఆమోదించిన విజయ్‌కు, ఈ చర్యను బీజేపీ పంపిన సహకార నిరాకరణ సందేశంగా భావిస్తున్నారు.



తాము కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే, తమ ముందున్న ప్రయాణాన్ని బీజేపీ సులభతరం చేయదని ఆ పార్టీ తమకు పరోక్షంగా సూచిస్తోందని టివికె వర్గాలు తెలిపాయి. విజయ్ వద్ద ఇంకా సంపూర్ణ మెజారిటీ లేదు. అయితే, ఇందుకు సంబంధించి గతంలో అనేక ఉదాహరణలు ఉన్నాయి. మరే ఇతర కూటమి గానీ, పార్టీ గానీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు రానప్పుడు, అతిపెద్ద ఏకైక పార్టీని ఆహ్వానించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని కల్పించడం గవర్నర్ల విధి.

ఇది ఒక స్పష్టమైన విషయం, ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని ఈ తీర్పులో విజయ్‌కి చెందిన టీవీకే పార్టీ తిరుగులేని ఆధిక్యంతో అగ్రస్థానంలో ఉంది. సభలో తమ సంఖ్యాబలాన్ని నిరూపించుకోవడానికి ఆ పార్టీకి అవకాశం అవసరం. ప్రణాళిక ప్రకారం మే 7న ఆయన ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. కానీ జరుగుతున్న ఈ జాప్యం అన్యాయం, దీనిని తీవ్రంగా వ్యతిరేకించాలి, ప్రశ్నించాలి. విజయ్ ప్రమాణ స్వీకారాన్ని ఆలస్యం చేయడం ద్వారా రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవలసి ఉంటుంది. విజయ్ ప్రమాణ స్వీకారాన్ని ఆలస్యం చేయడం రాజ్యాంగ విరుద్ధం అని పలువురు రాజ్యాంగ నిపుణులు స్పష్టంగా పేర్కొన్నారు. మెజారిటీని సభలో ప్రదర్శించాల్సి ఉంటుంది కానీ గవర్నర్ ముందు కాదు.

లోక్ భవన్ తన విచక్షణాధికారాలను అన్యాయమైన రీతిలో వినియోగించడం ద్వారా, మరొక ప్రమాదకరమైన ఉదాహరణను నెలకొల్పడానికి దారితీస్తోంది. విజయ్ ప్రమాణ స్వీకారం చేయాలని డిఎంకె, వామపక్షాలు, విసికెవంటి పార్టీలు కూడా డిమాండ్ చేశాయి. విజయ్ బాధ్యతలు స్వీకరించకుండా అడ్డుకుంటున్నవారిగా కనిపించే అపప్రథను మూటగట్టుకోవడానికి ఎవరూ సాహసించడం లేదు. అయినప్పటికీ, వామపక్షాలు, విసికె మాత్రం తమ మద్దతు లేఖలను ఇంకా సమర్పించలేదు.

టివికెకు 108 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. విజయ్ రెండు స్థానాల్లో విజయం సాధించినందున ఒకరిని మినహాయిస్తే, ఆ పార్టీ వాస్తవ బలం 107కు చేరుతుంది. కాంగ్రెస్ తన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతును లిఖితపూర్వకంగా అందించింది. దీంతో, 118 స్థానాల సాధారణ మెజారిటీ మార్కును చేరుకోవడానికి టివికెకు ఇంకా 6 స్థానాల కొరత ఉంది.

**టివికెకు 108 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. విజయ్ రెండు స్థానాల్లో విజయం సాధించినందున ఒకరిని మినహాయిస్తే, ఆ పార్టీ వాస్తవ బలం 107కు చేరుతుంది. కాంగ్రెస్ తన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతును లిఖితపూర్వకంగా అందించింది. దీంతో, 118 స్థానాల సాధారణ మెజారిటీ మార్కును చేరుకోవడానికి టివికెకు ఇంకా 6 స్థానాల కొరత ఉంది. ఈ ఆరు సీట్లు ఎక్కడి నుండి వస్తాయనేది టీవీకే తేల్చుకోవాల్సిన విషయం, కానీ అందుకు దానికి తగినంత సమయం ఇవ్వాలి.**

ఈ ఆరు సీట్లు ఎక్కడి నుండి వస్తాయనేది టీవీకే తేల్చుకోవాల్సిన విషయం, కానీ అందుకు దానికి తగినంత సమయం ఇవ్వాలి. లెఫ్ట్, వీసీకే మరో ఆరు సీట్లు ఇచ్చే అవకాశం ఉంది, ఐయూఎంఎల్, పీఎంకే కూడా ఇతర ప్రత్యామ్నాయాలే.

డీఎంకే తన మిత్రపక్షాలను తమతోనే ఉండేలా ఒత్తిడి చేస్తున్నట్లు కనిపిస్తోంది. అందరూ గట్టిగా బేరసారాలు జరుపుతున్నందున, విజయ్‌కు ఇబ్బందులు సృష్టించడానికి ఇది ఒక పరోక్ష దూకుడు మార్గం. ఈ నేపథ్యంలో, ఎఐఎడిఎంకెలో ఒక వర్గం టివికెతో పొత్తు పెట్టుకోవాలని గట్టిగా పట్టుబడుతోంది. అయితే, మాజీ ముఖ్యమంత్రి, ఎఐఎడిఎంకె అధినేత ఎడప్పాడి పళని స్వామి (ఇపిఎస్) మాత్రం దీనికి నిరాకరిస్తున్నారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

వాస్తవానికి, మొత్తం 47 మంది ఎమ్మెల్యేలలో దాదాపు 30 మంది వరకు, అంటే గణనీయమైన సంఖ్యలో ఎమ్మెల్యేలు ఈ పొత్తుకు అనుకూలంగా ఉన్నారని, రెండు ఆకులు (ఎఐఎడిఎంకె గుర్తు) 'ఈలస (టివికె గుర్తు)తో భాగస్వామ్యం ఏర్పరచుకోవాలని వారు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. విసికెకి పంపిన ట్లుగా, మద్దతు కోరుతూ టివికె అధినేత నుండి ఎటువంటి అధికారిక లేఖ ఇంకా రాలేదని కూడా వారు తెలిపారు; అయితే, ఇపిఎస్ ఈ పొత్తుకు అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నారని అంతర్గత సంప్రదింపుల ద్వారా నిర్ధారణ అయినప్పుడు మాత్రమే ఆ లేఖ పంపే ప్రక్రియ జరుగుతుందని వారు వివరించారు.


ఇపిఎస్, కాస్త వెనక్కి తగ్గి, విజిల్ శబ్దానికి ద్వితీయ ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. విజయ్ సంఖ్యాబలం ఈ సమస్యను తేల్చేసింది. ఎన్నికలకు ముందు ఇపిఎస్, విజయ్ పొత్తు పెట్టుకోకపోవడానికి కారణం, తమ పార్టీలలో ముఖ్యమంత్రి అభ్యర్థులు ఉన్నందున వారిలో ఎవరూ వెనక్కి తగ్గడానికి ఇష్టపడకపోవడమే. ఈ ఎన్నికలలో ఇపిఎస్ ఘోరంగా ఓడిపోయారు, ఇక దీర్ఘకాలికంగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఆ రెండు పార్టీలు సహజ మిత్రపక్షాలు. విజయ్ ఆరాధించే వారిలో ఒకరు ఏఐఏడీఎంకే దిగ్గజ వ్యవస్థాపకుడు ఎంజీఆర్. ఇక డిఎంకె పట్ల ఆయన వ్యతిరేకత అవినీతి, కుటుంబ పాలన వల్ల మాత్రమే, ద్రావిడ సిద్ధాంతానికి కాదు. రాష్ట్రంలో డిఎంకేను సమర్థవంతంగా సవాలు చేసే సామర్థ్యాన్ని కోల్పోయామని, తమ ఉనికిని నిలుపుకోవడానికి విజిల్ శక్తి అవసరమని ఎఐఎడిఎంకే అంగీకరించాలి. తనకు తగినంత సంఖ్యాబలం లేదని, భవిష్యత్తు కోసం సంకీర్ణాన్ని నిర్మించడానికి ఒక బలమైన మిత్రపక్షం ఉండటం ముఖ్యమని విజయ్ కూడా అంగీకరించాలి.

విజయ్ బాధ్యతలు చేపట్టకుండా అడ్డుకోవడానికి చేసే ఏ ప్రమాదకరమైన ప్రయోగాన్ని తమిళనాడు సహించదు. నిజానికి, ఎఐఎడిఎంకేడిఎంకే చర్చలు జరుగుతున్నాయనే వదంతులను మీడియాలోని కొన్ని వర్గాలు తీవ్రంగా ప్రచారం చేశాయి. ప్రజాస్వామ్యాన్ని గౌరవించే రాష్ట్రంలో అలాంటి ప్రయోగం అసంబద్ధమైనది, ప్రమాదకరమైనది. విజయ్ సంఖ్యాబలాన్ని కూడగట్టుకుంటున్న తరుణంలో, ఈ వదంతి వెనుక ఉన్న దుర్మార్గం తక్కువేం కాదు.

చెన్నైలో రాబోయే రెండు రోజులు అపూర్వమైన వాదోపవాదాలు జరగనున్నాయి. రాష్ట్రంలో సంఖ్యాబలం కోసం ఇంతటి పోరాటం ఎన్నడూ జరగలేదు. వాస్తవానికి, ఒక హంగ్ తీర్పు 2006లో వచ్చింది, కానీ అది స్ఫూర్తి పరంగా హంగ్ తీర్పు కాదు, ఎందుకంటే అప్పుడు డిఎంకే పార్టీకి అవసరమైన దానికంటే చాలా తక్కువ సీట్లు ఉన్నప్పటికీ, డిఎంకే కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది.

అన్ని విధాలా చూస్తే, రాష్ట్ర రాజకీయాల్లో ఇది ఒక ఆసక్తికరమైన దశ. విజయ్ నటించిన జన నాయగన్ చిత్రం విడుదల చేయడానికి అనుమతి లభించలేదు; అయితే, విజయ్ సర్కార్ విడుదలను అడ్డుకోవడానికి చేసే ఏ ప్రయత్నమైనా తీవ్ర పరిణామాలకు దారితీయడమే కాకుండా, ప్రజాస్వామ్య, తిరుగుబాటు సంప్రదాయాలను ఎంతో ఆదరించే రాష్ట్రంలో ఒక దుష్ట సంప్రదాయాన్ని నెలకొల్పుతుంది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని ఈ తీర్పులో విజయ్ కి చెందిన టీవీకే పార్టీ తిరుగులేని ఆధిక్యంతో ఉంది, కనుక సభలో తమ బలాన్ని నిరూపించుకోవడానికి దానికి అవకాశం ఇవ్వాలి. అంతిమంగా, విజయ్, అతని టీవీకే ఇప్పటికీ బీజేపీ, డీఎంకేల మధ్య చిక్కుకున్నట్లే కనిపిస్తోంది. ఈ పరిస్థితిని ఆయన ఎలా అధిగమిస్తారనేదే ఆయనకు మొదటి పెద్ద పరీక్ష కానుంది.

# చికిత్స లేకున్నా అదుపు సాధ్యమే




అనువంశిక రక్త రుగ్మతగా గుర్తించిన తలసేమియా వ్యాధితో దాదాపు 3.4 శాతం ప్రపంచ జనాభా బాధపడుతున్నట్లు అంచనా. భారత్‌లో ప్రతి ఏట పది వేలకు పైగా పిల్లలు తలసేమియా వ్యాధి బారిన పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తలసేమియా వ్యాధిగ్రస్థుల్లో తరుచుగా హీమోగ్లోబిన్ శాతం తగ్గడం, త్వరగా అలసిపోవడం కనిపిస్తుంది. వ్యాధి తీవ్రత మరింత పెరిగితే రక్తహీనత ఏర్పడి రక్త మార్పిడి ద్వారా రక్తాన్ని అందించడం చేయవలసిన అత్యవసర పరిస్థితులు కూడా వస్తాయి. తలసేమియాకు పూర్తి వైద్య చికిత్స లేదు, కాని వ్యాధి అదుపులో ఉంచుకోవడం మాత్రమే మన చేతిలో ఉందని తెలుసుకోవాలి.

**అంతర్జాతీయ తలసేమియా దినం-2026 ఇతివృత్తం**

తలసేమియా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ చొరవతో 1994లో ఏర్పడిన అంతర్జాతీయ తలసేమియా దినం రోజున వ్యాధిగ్రస్తులకు, సహాయకులను తగు అవగాహనలు కల్పించడం, వ్యాధి లక్షణాలను వివరించడం, వైద్య సూచనలు తీసుకోవడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. తలసేమియా రోగుల్లో అవగాహన పెంచడం, ఆత్మవిశ్వాసం ఇవ్వడం, తగు చేయూతలను ఇవ్వడం లాంటి అంశాలను చర్చించడానికి ప్రతి ఏట 08 మే రోజున ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ తలసేమియా దినం (ఇంటర్నేషనల్ తలసేమియా డే)"గా పాటించడం ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ తలసేమియా దినం 2026 ఇతివృత్తంగా "దాపరికం ఏమీ లేదు : రోగనిర్ధారణ కాని వారిని గుర్తిద్దాం, కనిపించని వారిని కనిపెడదాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతుంది.

**పూర్తి చికిత్స లేకపోయినా, అదుపులో ఉంచుకోవచ్చా**

అనువంశిక వ్యాధి కావడంతో పెళ్లికి ముందు జంట తలసేమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవడం ఒక ఉత్తమ మార్గంగా గుర్తించాలి. తలసేమియా రోగులు పోషకాహారం తీసుకోవడం, శారీరక శ్రమను వైద్యుల అనుమతుల మేరకు చేయడం, సాధారణ పిల్లలకు టీకాలు ఇప్పించడం, రోగులకు అవగాహన కల్పించడం నిరంతరం కొనసాగాలి. ఎముకల బలహీనత, గుండె సంబంధ సమస్యలు, యెల్లో చర్మం, పిల్లల్లో పెరుగుదల మందగించడం, కడుపు వాపు, ముదురు రంగులో మూత్రం రావడం లాంటి లక్షణాలు అధికంగా కనిపిస్తాయి. వ్యాధిగ్రస్తుల్లో కాలేయం, నుదురు, చెంపలు, ప్లీహం వాపు లాంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. తలసేమియా రోగుల్లో కామెర్ల వ్యాధి కూడా సోకే ప్రమాదం లేకపోలేదు. అనువంశిక రక్త రుగ్మత అయిన తలసేమియాకు సరైన చికిత్స లేనప్పటికీ, వ్యాధి అదుపు చేయడంలో వైద్య చికిత్సలు దోహదపడతాయని తెలుసుకోవాలి. ఎర్ర రక్త కణాల్లో లోపం వల్ల ఏర్పడిన తలసేమియా వ్యాధి ఆల్ఫా, బీటా, డెల్టా అనబడే మూడు రకాల తలసేమియాలు కనిపిస్తాయి. తలసేమియా రకాన్ని బట్టి వ్యాధి చికిత్సలు వేరు వేరుగా ఉంటాయి. అంతర్జాతీయ తలసేమియా దినం వేదికగా పౌర సమాజం తలసేమియా రోగులకు తగు ధైర్యాన్ని అందించడం, ఆపన్నహస్తాల గొడుగులు పట్టడం మన కనీస కర్తవ్యంగా భావిద్దాం, తలసేమియా మరణాలను కట్టడి చేద్దాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# తెల్ల దుస్తుల్లోని తల్లితనం !

మరణం గది తలుపు దగ్గర నిశ్శబ్దంగా నిల్చున్న రాత్రుల్లో కూడా తెల్లని వెలుగులా వచ్చి... చీకటికి తెలియకుండా రోగిలో ఆశనుచిగురించే హృదయాలు వాళ్ళు. ప్రతి సంవత్సరం మే 12న ప్రపంచం మొత్తం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ను గౌరవంతో జరుపుకుంటుంది. ఇది కేవలం ఒక వృత్తిని స్మరించుకునే రోజు కాదు; బాధలో ఉన్న మనిషిని తన మనిషిలా చూసుకునే హృదయాలకు వందనం చేసే రోజు. ఆధునిక నర్సింగ్‌కు పునాది వేసిన ఫ్లారెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ రోజు నిర్వహించబడుతుంది. ప్రపంచం మారినా, వైద్య సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, మనిషి బాధ ముందు నిలబడి అతనికి ధైర్యం చెప్పే హృదయం మాత్రం ఇప్పటికీ నర్సుదే.

నర్సులను చాలామంది “తెల్ల గులాబీలు” అంటారు. ఎందుకంటే తెల్ల గులాబీ స్వచ్ఛతకు, నిశ్శబ్ద ప్రేమకు, కరుణకు ప్రతీక. నర్సుల జీవితం కూడా అలాగే ఉంటుంది. వారు గొప్పతనాన్ని ప్రకటించుకోరు; కానీ వారి సేవ వేలాది ప్రాణాల్లో వెలుగై నిలుస్తుంది. ఆసుపత్రి గదుల్లో వినిపించే నొప్పి కేకల మధ్య, భయంతో ఏడుస్తున్న పిల్లల మధ్య, ప్రాణం కోసం పోరాడుతున్న వృద్ధుల మధ్య — ఒక మృదువైన మాటతో ఆశను నింపేది నర్సే. “తల్లి చేతుల్లో ప్రేమ ఉంటే, నర్సు చేతుల్లో ప్రేమతో పాటు ప్రాణాన్ని నిలబెట్టే ఓర్పు ఉంటుంది.”

“నర్సింగ్ అనేది కేవలం పని కాదు; అది మనిషి బాధను తన హృదయంలో మోసే కళ” అని ఫ్లారెన్స్ నైటింగేల్ అన్నారు. ఈ మాట నర్సింగ్ అసలు ఆత్మను తెలియజేస్తుంది. ఒక రోగి బాధపడుతున్నప్పుడు తల్లి ఎలా అతని నుదిటిపై చెయ్యి వేసి ధైర్యం చెబుతుందో, నర్సు కూడా అదే తల్లితనంతో రోగిని చూసుకుంటుంది. రాత్రంతా నిద్ర లేకుండా జ్వరంతో వణికే బిడ్డ పక్కన కూర్చునే తల్లిలా, నర్సు కూడా అలసటను మరిచి రోగి మంచం పక్కనే నిలుస్తుంది. ఆసుపత్రుల్లో నర్సుల అడుగులు ఎప్పుడూ ఆగవు. వారు పగలు రాత్రి తేడా లేకుండా పని చేస్తారు. వైద్యులకు సహాయం చేస్తారు. రోగి శ్వాసలో చిన్న మార్పు వచ్చినా ముందుగా గుర్తించేది నర్సే. రోగి కన్నీళ్ల వెనుక దాగి ఉన్న భయాన్ని అర్థం చేసుకునేది కూడా నర్సే.

పేర్లు మరిచిపోతారు; కానీ తమ చేతిని పట్టుకుని ధైర్యం చెప్పిన నర్సును మాత్రం జీవితాంతం గుర్తుంచుకుంటారు. “బాధలో ఉన్న మనిషి పక్కన నిలబడటం కన్నా గొప్ప మానవ సేవ లేదు” అని ప్రపంచ ప్రఖ్యాత సేవామూర్తి క్లారా బర్టన్ అన్నారు. ఈ మాట నర్సుల సేవాస్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. నర్సింగ్ అనేది కేవలం వైద్య సేవ కాదు; అది మనిషి నొప్పిని తనదిగా భావించే హృదయం. చిరాకు చూపే రోగి, నొప్పితో అరుస్తున్న వృద్ధుడు, భయంతో ఏడుస్తున్న చిన్నారి — అందరినీ ఒకే ప్రేమతో చూసుకోవడం నర్సుల గొప్పతనం. “ఓర్పు ప్రేమను తాకినప్పుడు అది నర్సింగ్‌గా మారుతుంది.” కోవిడ్ 19 మహమ్మారి సమయంలో నర్సుల అసలైన మహోన్నత త్యాగం చూసింది ప్రపంచం. ఆ రోజుల్లో ఆసుపత్రులు భయంతో నిండిపోయాయి. కుటుంబ



సభ్యులు కూడా దగ్గరకు రాలేని పరిస్థితుల్లో రోగి పక్కన నిలిచింది నర్సే. తమ ప్రాణాల గురించి ఆలోచించకుండా, తమ పిల్లలను దూరంగా ఉంచుకుని, అనేకమంది నర్సులు మానవత్వం కోసం సేవ చేశారు. వారి చిరునవ్వుల వెనుక ఎంత అలసట, ఎంత బాధ, ఎంత త్యాగం దాగి ఉందో ప్రపంచం అప్పుడు గ్రహించింది. “రోగి చేయలేని పనిని అతను మళ్లీ చేయగలిగే వరకు ప్రేమతో చేయడం నర్సు ధర్మం” అని ఆధునిక నర్సింగ్ సిద్ధాంతాలకు మార్గదర్శకురాలైన వర్జీనియా హండర్సన్ అన్నారు. ఈ మాటల్లో నర్సుల తల్లితనం దాగి ఉంది. రోగి ఒంటరిగా ఉన్నప్పుడు నర్సు మాటల్లో ఓదార్పు ఉంటుంది. వృద్ధుల చేతిని పట్టుకుని నడిపించేటప్పుడు ఆమె కళ్ళలో కరుణ కనిపిస్తుంది. చిన్న పిల్లలకు ఇంజెక్షన్ ఇస్తూ “భయపడొద్దు” అని చెప్పేటప్పుడు ఆమె స్వరంలో తల్లి ప్రేమ వినిపిస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో కూడా నర్సుల సేవ అమూల్యమైనది. పరిశుభ్రత, టీకాలు, గర్భిణీ స్త్రీల సంరక్షణ, పిల్లల ఆరోగ్యం — ప్రతి విషయంలో వారు ప్రజలకు మార్గదర్శకులుగా నిలుస్తారు. చాలా గ్రామాల్లో వైద్యుడి కంటే ముందుగా ప్రజలు నమ్మేది నర్సునే. ఎందుకంటే ఆమె మాటలో వైద్య జ్ఞానం మాత్రమే కాదు, మనిషి పట్ల నిజమైన శ్రద్ధ ఉంటుంది.

మేరీ సీకోల్ జీవితం మొత్తం యుద్ధ బాధితులకు సేవ చేస్తూ ఇలా భావించారు: “మనిషి బాధ ముందు దేశం, భాష, రంగు అనే తేడాలు ఉండవు.” నర్సింగ్ వృత్తికి జ్ఞానం అవసరం. కానీ అంతకంటే ఎక్కువగా అవసరమయ్యేది హృదయం. ఒక రోగి నొప్పిని తన నొప్పిలా అనుభూతి చెందే మనసు లేకపోతే నిజమైన నర్సుగా మారడం సాధ్యం కాదు. అందుకే నర్సుల సేవను డబ్బుతో కొలవలేము. అది త్యాగంతో, మానవత్వంతో, కరుణతో నిండిన జీవన విధానం. “రోగి శరీరాన్ని మందు నయం చేస్తుంది... కానీ రోగి మనసును నయం చేసేది నర్సు ప్రేమ.” నర్సులు లేకుండా ఆసుపత్రి అనే ఆలోచనే అసంపూర్ణం. వైద్య పరికరాలు ఉండొచ్చు, మందులు ఉండొచ్చు, గొప్ప వైద్యులు ఉండొచ్చు. కానీ రోగి మంచం పక్కన నిలబడి అతని భయాన్ని తగ్గించే నర్సు లేకపోతే ఆ ఆసుపత్రిలో మానవత్వం ఉండదు. నర్సు లేని ఆసుపత్రి అంటే గుండె లేని శరీరం లాంటిది. ఎందుకంటే ఆసుపత్రిని నిజంగా జీవంతో నింపేది నర్సుల సేవే. నర్స్ ఒక విచిత్రమైన విరుద్ధం. తన మనసులో ఎంత అలసట దాచుకున్నా, ఇతరుల ముఖాల్లో ధైర్యాన్ని నింపుతుంది. తన కళ్లలో నిద్ర లేకపోయినా, రోగికి ప్రశాంతమైన నిద్ర కావాలని కోరుకుంటుంది. ప్రతి రోజు బాధను చూస్తూనే ఉంటుంది; అయినా ప్రతి ఉదయం చిరునవ్వుతోనే మొదలవుతుంది. పరాయి మనిషి నొప్పిని తనదిగా అనుభూతి చెందుతూ, తన స్వంత బాధను మాత్రం నిశ్శబ్దంలో దాచేస్తుంది. ఆసుపత్రి గదుల్లో ఆమె అడుగులు వినిపించకపోవచ్చు, కానీ ఆమె లేని లోటు మాత్రం ప్రతి గోడకు తెలుస్తుంది. రోగి భయాన్ని తగ్గించే క్రమంలో తన భయాలను మరిచిపోతుంది. మరణం అంచున నిలిచిన జీవితాల మధ్య తిరుగుతూ కూడా, ఆశ మీద నమ్మకం కోల్పోని మనసే నర్స్. అందుకే నర్స్ కేవలం ఒక వృత్తి కాదు — ఇతరుల కన్నీళ్లను మోస్తూ, తన కన్నీళ్లకు సమయం లేకుండా జీవించే మానవత్వపు నిశ్శబ్ద రూపం.

తెల్లని దుస్తులు... లోపల అలసిన మనసు... బయట ధైర్యం. చివరిగా — “తెల్ల దుస్తుల్లో కనిపించేది ఒక ఉద్యోగి కాదు... తల్లిలా ఓదార్చే హృదయం. అలసటను దాచుకుని చిరునవ్వు పంచే మనసు. ప్రాణం కోసం పోరాడే నిశ్శబ్ద దేవత.” అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రపంచంలోని ప్రతి నర్సుకూ హృదయపూర్వక వందనాలు. వారి చేతుల్లో చికిత్స మాత్రమే కాదు — ఓర్పు, తల్లితనం, మానవత్వం, ఆశ కూడా ఉంటాయి.

**నర్సులను చాలామంది “తెల్ల గులాబీలు” అంటారు. ఎందుకంటే తెల్ల గులాబీ స్వచ్ఛతకు, నిశ్శబ్ద ప్రేమకు, కరుణకు ప్రతీక. నర్సుల జీవితం కూడా అలాగే ఉంటుంది. వారు గొప్పతనాన్ని ప్రకటించుకోరు; కానీ వారి సేవ వేలాది ప్రాణాల్లో వెలుగై నిలుస్తుంది. ఆసుపత్రి గదుల్లో వినిపించే నొప్పి కేకల మధ్య, భయంతో ఏడుస్తున్న పిల్లల మధ్య, ప్రాణం కోసం పోరాడుతున్న వృద్ధుల మధ్య — ఒక మృదువైన మాటతో ఆశను నింపేది నర్సే. “తల్లి చేతుల్లో ప్రేమ ఉంటే, నర్సు చేతుల్లో ప్రేమతో పాటు ప్రాణాన్ని నిలబెట్టే ఓర్పు ఉంటుంది.”**

బొల్లిముంత
వెంకట రమణా రావు
9347592054



# జాతీయం-అంతర్జాతీయం



## శుక్రవారం తమిళనాడులో
# కాంగ్రెస్ ధర్నాలు

చెన్నై, మే 7 (వుదయం):



తమిళనాడులో టివికెకు మద్దతు ప్రకటించినప్పటి నుంచీ కాంగ్రెస్ పార్టీ ఆ రాష్ట్రంలో తన ఉనికిని చాటుకునేందుకు తీవ్ర యత్నాలు చేస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ ఏర్పాటు అంశం రాజ్యాంగ సంక్షోభానికి దారి తీస్తున్న నేపథ్యాన్ని తన ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. తాము మద్దతిస్తున్న విజయ్ ప్రభుత్వ ఏర్పాటును గవర్నర్ ఆలస్యం చేస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టబోతోంది. గవర్నర్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, శుక్రవారం రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది.తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టిఎన్‌సిసి) గవర్నర్ నిర్ణయాన్ని నిరసిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం చెన్నైలోని గవర్నర్ అధికారిక నివాసం (లోక్ భవన్)ను ముట్టడించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చింది. కేవలం చెన్నైలోనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు ఇచ్చిన తీర్పును గవర్నర్ కాలరాస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ ఈ నిరసనలకు శ్రీకారం చుట్టింది.గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తీరు కేవలం కాలయాపన చేయడమేనని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. 108 సీట్లతో అతిపెద్ద పార్టీగా ఉన్న టివికెకి, కాంగ్రెస్ (5 సీట్లు) వామపక్షాల మద్దతు కలిపితే మెజారిటీకి చేరువలో ఉన్నామని, ఈ తరుణంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపిస్తున్నారు. 'ప్రజలు మార్పును కోరుకున్నారు, కానీ గవర్నర్ మాత్రం ఢిల్లీ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు' అని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.కాంగ్రెస్ పిలుపుతో తమిళనాడులో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే TVK కార్యకర్తలు ఆందోళనలో ఉండగా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా తోడవడంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సీపీఎం, సీపీఐ పార్టీలు కూడా ఈ ఆందోళనలకు మద్దతు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. అతిపెద్ద పార్టీగా ఉన్న టీవీకే అధినేత విజయ్‌ను వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించాలని కాంగ్రెస్, వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గవర్నర్ వ్యవస్థను ఉపయోగించుకుని బీజేపీ రాష్ట్రంలో అస్థిరత సృష్టించాలని చూస్తోందని.. అందుకోసమే, రేపు ఉదయం నుంచే తమిళనాడులోని అన్ని ప్రధాన పట్టణాల్లో కాంగ్రెస్ శ్రేణులు రోడ్ల మీదకు రానున్నాయని కాంగ్రెస్ ప్రకటించింది.

## వియత్నాం
# అధ్యక్షుడికి రాష్ట్రపతి ఆతిథ్యం

వుదయం డెస్క్, మే 7:



అధ్యక్షు లామ్ మొదటి సారి భారత్‌లో అధికార పర్యటనకు విచ్చేసిన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను స్వాగతించారు. భారత్ వియత్నాం మధ్య మంచి స్నేహం ఉందనీ, దీనికి చరిత్రాత్మక, నాగరికతా ప్రధాన, సాంస్కృతిక సంబంధాలు మూలాధారంగా ఉన్నాయన్నారు.భారత్ వియత్నాం ద్వైపాక్షిక సంబంధాలు ఇటీవల కొన్నేళ్లలో ఉన్నత స్థాయి ఆదాన ప్రదానాలు, రక్షణ పరమైన, భద్రత పరమైన సహకారం, అభివృద్ధి ప్రధాన భాగస్వామ్యంతో పాటు వాణిజ్యం, ఆరోగ్యం, సైన్స్ టెక్నాలజీ, పర్యటన వంటి రంగాలకు విస్తరించాయని రాష్ట్రపతి అన్నారు. ఈ పర్యటన కాలంలో, అరుదైన ఖనిజాలు (రేర్ ఎర్త్ మినరల్స్), డిజిటల్, ఫైనాన్షియల్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య వంటి ముఖ్య రంగాల్లో ఒప్పందాలు కుదరడంతో పాటు కీలక ప్రకటనల వెల్లడి చోటుచేసుకున్న సంగతి తెలిసి తాను సంతోషించానని రాష్ట్రపతి అన్నారు.భారత్, వియత్నాంలు ''ఇతోధిక సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై సంయుక్త ప్రకటన'' ద్వారా ద్వైపాక్షిక సంబంధాల్ని మరింత బలపరుచుకోవాలని నిర్ణయించుకొన్నట్లు తెలుసుకొని రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు.గత పదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం చెప్పుకోదగిన స్థాయిలో వృద్ధి చెందిందనీ, దీనిని సమతౌల్యమైన, ఉభయ పక్షాలకూ లాభదాయకమైన పద్ధతుల్లో విస్తరించుకోవాలని భారత్ ఆశిస్తున్నట్లు రాష్ట్రపతి తెలిపారు.''ఆసియాన్‌తో మా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ప్రణాళిక పరిధిలో, వియత్నాంతో మా సంబంధాలు మేం అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంతో పాటు ఇండోపసిఫిక్ దార్శనికతలో ముఖ్య భాగంగా ఉన్నాయి'' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. 'ఇండోపసిఫిక్ ఓషన్స్ ఇనీషియేటివ్'లో వియత్నాం భాగస్వామ్యాన్ని రాష్ట్రపతి ప్రశంసించారు.భారత్‌వియత్నాం ద్వైపాక్షిక సంబంధాలకు రక్షణ, భద్రత ప్రధానాంశాలుగా ఉన్నాయని రాష్ట్రపతి అన్నారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడంలో, ప్రాంతీయ శాంతినీ, ప్రాంతీయ స్థిరత్వాన్నీ ప్రోత్సహించడంలో వియత్నాంతో కలిసి పనిచేయాలన్నదే భారత్ నిబద్ధత అని ద్రౌపదీ ముర్ము స్పష్టం చేశారు. భారత్, వియత్నాంల మధ్య సన్నిహిత సహకారంతో మన రెండు దేశాల ప్రజలకూ ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయంటూ నేతలిద్దరూ అంగీకారాన్ని వ్యక్తం చేశారు. అధ్యక్షుడు తో లామ్ నాయకత్వంలో భారత్‌వియత్నాం సంబంధాలు ఇదివరకటి కన్న ఎక్కువ బలోపేతం కాగలవన్న విశ్వాసాన్ని రాష్ట్రపతి వ్యక్తం చేశారు.

# మీ వల్ల మాకు నష్టం

- డిఎంకెపై కాంగ్రెస్ మండిపాటు

వుదయం డెస్క్, మే 7:

తమిళనాడులో రాజకీయం గరం గరంగా ఉంది. నిన్నటి వరకూ అత్యంత సన్నిహిత మిత్ర పక్షాలైన కాంగ్రెస్, డిఎంకె వేర్వేరు మార్గాలు ఎంచుకోవడానికి నిర్ణయించుకోవడంతో కొంత ఉద్రిక్తత నెలకొంటోంది. టీవీకే అధినేత విజయ్‌కి కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించడంతో డీఎంకేలోని కొందరు నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తమకు వెన్నుపోటు పొడిచిందని వారు విమర్శలు గుప్పించారు. డీఎంకే వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాణిక్కం ఠాకూర్ స్పందించారు. అసలు డీఎంకే కారణంగానే తమ పార్టీ నష్టపోయిందని ఎదురుదాడి చేశారు.డీఎంకే పార్టీతో పొత్తు కారణంగా తాము 17 సీట్లను కోల్పోవాల్సి వచ్చిందని ఆరోపించారు. తమిళనాడు ప్రజలు విజయ్ నాయకత్వాన్ని కోరుకున్నారని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయని అన్నారు. గవర్నర్ వెంటనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి విజయ్‌ని ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకోవడానికి అవకాశం ఇవ్వాలని సూచించారు. తమిళ ప్రజలు మార్పుకు ఓటు వేశారని స్పష్టంగా తెలుస్తోందని అన్నారు. ప్రజలు కొత్త నాయకుడికి పట్టం కట్టినట్లు తెలిపారు. టీవీకే పార్టీ నుంచి 108 మంది ఎమ్మెల్యేలు విజయం సాధించారని అన్నారు. తమ పార్టీ మద్దతుతో విజయ్‌కి 113 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని అన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 118 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండాలని గుర్తు చేశారు. గవర్నర్ బీజేపీ మనిషి అని, ఈ ఢిల్లీ మైండ్ సెట్ గవర్నర్‌కు విజయ్ ముఖ్యమంత్రి కావడం ఇష్టం లేదని విమర్శించారు. బీజేపీ అధిష్ఠానం నుంచి గవర్నర్‌పై ఒత్తిడి ఉందని అన్నారు. ప్రభుత్వ ఏర్పాటును కావాలని జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీకి రాష్ట్రం నుంచి ఒకే ఎమ్మెల్యే ఉన్నారని, ఆ ఒక్క ఎమ్మెల్యేతో రాష్ట్రంలో రాజకీయం చేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. ఇది దురదృష్టకరమని అన్నారు.

## సైనిక శక్తికి కీలక కేంద్రంగా
# ఆవిర్భవించిన భారత్

### ఆపరేషన్ సింధూర్ తొలి వార్షికోత్సవం

వుదయం డెస్క్, మే 7:

పాకిస్థాన్‌లో ఏ ఉగ్ర స్థావరం సురక్షితం కాదని ఆపరేషన్ సిందూర్‌తో స్పష్టమైన సందేశం ఇచ్చామని భారత త్రివిధ దళాలు పేర్కొన్నాయి. దేశ ప్రజలను, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడుకోగలదని స్పష్టం చేశాయి. గురువారం జైపూర్‌లో ఆపరేషన్ సింధూర్ మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడంతో, రాజస్థాన్ మరోసారి భారతదేశ సైనిక శక్తికి కీలక కేంద్రంగా ఆవిర్భవించింది. నూతన శకంలో సైనిక సామర్థ్యం అనే ఇతివృత్తంతో జరిగిన సంయుక్త కమాండర్ల సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీనియర్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ కమాండర్లతో కలిసి సౌత్ వెస్ట్రన్ కమాండ్‌లో పాల్గొన్నారు. పాకిస్థాన్‌తో సరిహద్దు రాష్ట్రంగా రాజస్థాన్ కు పెరుగుతున్న వ్యూహాత్మక ప్రాముఖ్యతను ఈ కార్యక్రమం పట్టి చూపింది. ఈ సందర్భంగా సీనియర్ ఆర్మీ అధికారులు ఒక సంచలన ప్రకటన చేస్తూ, గత సంవత్సరం ఆపరేషన్ సింధూర్ సమయంలో 100 మందికి పైగా పాకిస్తానీ సైనికులు హతమయ్యారని పేర్కొన్నారు. ఆపరేషన్ ఇంకా ముగియలేదని, ఇది ఆరంభం మాత్రమేనని వెల్లడించారు.

ఈ రోజు ఉదయం, ఆర్మీ, వైమానిక దళం మరియు నౌకాదళం తరపున, 'ఆపరేషన్ సింధూర్' వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సైనిక అధికారులు , లెఫ్టినెంట్ జనరల్ జుబిన్ ఎ. మిన్వాలా, డిజిఎంఒ రాజీవ్ ఘాయ్, ఎయిర్ మార్షల్ అవధేష్ కుమార్ భారతి , వైస్ అడ్మిరల్ ఎ.ఎన్. ప్రమోద్ ఒక సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. గత ఏడాది చేపట్టిన ఈ ఆపరేషన్‌ను, భారతదేశ అభివృద్ధి చెందుతున్న సంయుక్త యుద్ధ సామర్థ్యానికి ఒక ప్రతీకగా వారు అభివర్ణించారు.

డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (స్ట్రాటజీ) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ, ఆపరేషన్ సింధూర్ ప్రపంచవ్యాప్తంగా స్వర్ణ ప్రమాణంగా మారిందని అన్నారు. భూ, వాయు, సముద్ర శక్తులను సమన్వయంతో ఉపయోగించడం ద్వారా సైన్యం, వైమానిక దళం, నావికా దళం, బీఎస్ఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను అమలు చేశాయని ఆయన పేర్కొన్నారు.

ఆర్మీ డీజీఎంఓ ప్రకారం, పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై భారత్ తొమ్మిది కచ్చితమైన దాడులు నిర్వహించింది. వీటిలో ఏడు ఆర్మీ, రెండు వైమానిక దళం జరిపినవి. నిజసమయ నిఘా సమాచార మార్పిడి, సమీకృత కార్యాచరణ వ్యవస్థలు, బహుళ సంస్థల సమన్వయం వల్ల ఉగ్రవాద మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, అదే సమయంలో ఘర్షణ మరింత ముదరలేదని అధికారులు తెలిపారు.

ఈ ఆపరేషన్ సమయంలో భారతదేశం 13 పాకిస్తానీ విమానాలను మరియు 11 సైనిక స్థావరాలను ధ్వంసం చేసిందని లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ పేర్కొన్నారు. 'ఆపరేషన్ సింధూర్' భారతదేశపు పెరుగుతున్న సైనిక స్వయం సమృద్ధిని చాటిచెప్పిందని, ఇందులో బ్రహ్మోస్, ఆకాష్ క్షిపణుల వంటి స్వదేశీ వ్యవస్థలు కీలక పాత్ర పోషించాయని ఆయన తెలిపారు. భారతదేశ రక్షణ పరికరాలలో దాదాపు 65 శాతం ప్రస్తుతం స్వదేశంలోనే తయారవుతున్నాయని ఆయన జోడించారు.

డిజిఎంఒ ఘాయ్, ఇతర అధికారులు, లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాద శిబిరాల్లో 100 మందికి పైగా పాకిస్తానీ సైనికులు, 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌లో ఏ ఉగ్రవాద స్థావరం కూడా సురక్షితం కాదనే స్పష్టమైన సందేశాన్ని 'ఆపరేషన్ సింధూర్' పంపిందని కూడా వారు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ అంతం కాదని, ఇదొక ఆరంభం మాత్రమేనని, భారతదేశం ఉగ్రవాదంపై తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఈ సీనియర్ అధికారులు నొక్కి చెప్పారు.




భారీ నష్టాలను చవిచూసిన తర్వాత, అవతలి పక్షం పర్యవసానాలను గ్రహించి కాల్పుల విరమణ కోరింది. ఆ అభ్యర్థన రాగానే, మేము మా కార్యకలాపాలను నిలిపివేశాము. మేము వెనక్కి తగ్గాము, కానీ దీనిని బలహీనతకు సంకేతంగా చూడకూడదు," అని ఘాయ్ అన్నారు. "ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదు; ఇది కేవలం ఆరంభం మాత్రమే," అని ఆయన నొక్కి చెప్పారు.

ఏప్రిల్ 22, 2025న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి ఆపరేషన్ సింధూర్ ఒక నిర్ణయాత్మక ప్రతిస్పందన అని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఎయిర్ మార్షల్ అవధేష్ కుమార్ భారతి అభివర్ణించారు. ప్రతి ఉగ్రవాద చర్యకు భారతదేశం దృఢంగా, కచ్చితంగా ప్రతిస్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ఈ దాడులు పంపాయని ఆయన అన్నారు. ఆయన ప్రకారం, మే 7, 2025న జరిపిన మొదటి దాడి, పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంది, ఇది భారతదేశ వ్యూహాత్మక సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది.పాకిస్తాన్‌కు చైనా అందిస్తున్న మద్దతుపై వైస్ అడ్మిరల్ ఎ.ఎన్. ప్రమోద్ ఆందోళన వ్యక్తం చేశారు. అంతరిక్ష ఆధారిత వనరులు, నిఘా సమాచార భాగస్వామ్యం, సైబర్ సామర్థ్యాలు, ఆయుధ వ్యవస్థల విషయంలో చైనా అందిస్తున్న సహాయాన్ని భారతదేశ సైనిక అంచనాలు, వ్యూహ రచనలో పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పాకిస్తాన్, చైనాల మధ్య సంబంధం సముద్రాల కంటే లోతైనది, పర్వతాల కంటే ఉన్నతమైనది అని డిజిఎంఒ రాజీవ్ ఘాయ్ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, పాకిస్తాన్ సైనిక పరికరాలలో దాదాపు 80 శాతం చైనా మూలానికి చెందినవేనని ఆయన తెలిపారు

విస్తృత ప్రాంతీయ సవాళ్లను ప్రస్తావిస్తూ, పాకిస్తాన్, చైనా, టర్కీ వంటి బహుళ శత్రువులను భారతదేశం ఏకకాలంలో ఎదుర్కొన్నప్పటికీ, సాయుధ దళాలు వారందరినీ ఒకే వ్యూహాత్మక కూటమిలో భాగంగా అంచనా వేసి, ప్రతిస్పందిస్తాయని, ఈ పరిస్థితి "అతిగా ఆందోళన చెందాల్సినంతది కాదు" అని ఆయన నొక్కి చెప్పారు.

భారత్‌పాకిస్తాన్ ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో, ఆర్మీ డే పరేడ్, వాయు శక్తి2026 వైమానిక ప్రదర్శన నుండి ఇప్పటి వరకు ఆపరేషన్ సింధూర్ స్మారకోత్సవాల వరకు రాజస్థాన్ ప్రధాన రక్షణ కార్యక్రమాలకు కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతుండటం గమనార్హం.

జమ్మూ కశ్మీర్ పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ దళాలు గతేడాది మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టాయి. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో భీకర దాడులు చేసి అక్కడి కీలక ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే.

## బెంగాల్ ప్రమాణ స్వీకారానికి
# హాజరు కానున్న మోడీ

కోల్‌కత, మే 7 (వుదయం):



సెంట్రల్ కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో మే 9న పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ఏర్పాటు చేసే తొలి ప్రభుత్వ ప్రమాణ స్వీకార ఉత్సవానికి అగ్రశ్రేణి బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యే అవకాశం ఉంది.

ఒక బలమైన ఉనికిని ఏర్పరచుకోవడానికి సుదీర్ఘకాలం పాటు శ్రమించిన రాష్ట్రంలో, భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడమనేది ఒక చారిత్రాత్మక ఘట్టంగా పరిగణిస్తుండడంతో ఈ కార్యక్రమం ప్రాముఖ్యతను సంతరించుకుంది. పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఈ వేడుకకు హాజరవుతారని భావిస్తున్నారు.ముఖ్యమంత్రి ఎవరన్నది ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి రేసులో ముందున్నట్లుగా విస్తృతంగా కనిపిస్తోంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య, కేంద్ర మంత్రి సుకాంత మజుందార్, రాజ్యసభ మాజీ ఎంపీ స్వపన్ దాస్‌గుప్తా వంటి ఇతర పేర్లు పరిశీలనలో ఉన్నాయి .ఈ కార్యక్రమాన్ని ప్రకటిస్తూ, కొత్త ప్రభుత్వం మే 9న ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తుందని భట్టాచార్య తెలిపారు. కొత్త బీజేపీ ప్రభుత్వం మే 9న ఉదయం 10 గంటలకు బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణ స్వీకారం చేస్తుంది, అని ఆయన అన్నారు.ముఖ్యంగా, ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం బెంగాలీ క్యాలెండర్ ప్రకారం వైశాఖ మాసం 25వ రోజున జరగనుంది. ఈ రోజును రాష్ట్రవ్యాప్తంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి అయిన రవీంద్ర జయంతిగా పాటిస్తారు. అందుకే, ఈ కార్యక్రమానికి ఒక లోతైన సాంస్కృతిక ప్రాముఖ్యత సమకూరుతుంది.

బెంగాల్ సామాజిక, మేధో సంప్రదాయాలకు భిన్నమైన ఒక బహిర్గత రాజకీయ సంస్కృతికి బీజేపీ ప్రతినిధిగా ఉందని టిఎంసి నిరంతరం చేస్తున్న దాడిని తిప్పికొట్టే ప్రయత్నంలో భాగంగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే వ్యక్తి రాష్ట్రంలోనే పుట్టి, విద్యాభ్యాసం పూర్తి చేసిన 'స్థానిక బిడ్డ' అయి ఉంటారని షా ప్రచార సమయంలో పదేపదే నొక్కి చెప్పారు.తేదీ ఎంపిక, సందేశ రూపకల్పన, రాష్ట్రంలోని సాంస్కృతిక, మేధోపరమైన సంప్రదాయాలతో మమేకమయ్యే విస్తృత వ్యూహాన్ని ప్రతిబింబిస్తున్నాయని పార్టీ నాయకులు పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, భబానీపూర్, నందిగ్రామ్, ఈ రెండు స్థానాల నుండి విజయం సాధించిన అధికారి, పార్టీ ఆదేశాల మేరకు ఒక స్థానాన్ని ఖాళీ చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో దీర్ఘకాలిక పాలనను అందించే దిశగా పార్టీ కృషి చేస్తుందని పేర్కొంటూ, ఆయన బీజేపీ భవిష్యత్తుపై విశ్వాసం వ్యక్తం చేశారు.నేను 10 రోజుల్లోగా ఒక స్థానాన్ని ఖాళీ చేస్తాను. నేను ఏ స్థానాన్ని కొనసాగించాలో పార్టీ నిర్ణయిస్తుంది. భబానీపూర్, నందిగ్రామ్ ప్రజల పట్ల నా బాధ్యతను నేను మర్చిపోను, అని ఆయన అన్నారు.

## నా సహాయకుడైనందుకే
# అతన్ని చంపారు

- ముందస్తు ప్రణాళికతో పిఎ హత్య జరిగిందన్న సువేందు
- నేను మమతను ఓడించడమే ఇందుకు కారణం

కోల్‌కత, మే 7 (వుదయం):

తన వ్యక్తిగత సహాయకుడు చంద్రనాథ్ రథ్ హత్యను ఒక ముందస్తు ప్రణాళికతో చేసిన హత్యగా బీజేపీ నాయకుడు సువేందు అధికారి అభివర్ణించారు. ఈ దాడి రాజకీయ ప్రేరేపితమని, భవానిపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై తాను సాధించిన ఎన్నికల విజయంతో దీనికి సంబంధం ఉందని ఆయన ఆరోపించారు.ఆసుపత్రి నుండి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చిన తర్వాత, మధ్యమ్‌గ్రామ్‌లోని రథ్ నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ, ఈ హత్య ఒక లక్షితమైన, అత్యంత జాగ్రత్తగా ప్రణాళిక వేసిన చర్య అని సువేందు అధికారి పేర్కొన్నారు.

ఈ హత్య జరిగిన తీరును మనం ఎంత తీవ్రంగా ఖండించినా అది సరిపోదు. అతను నా సహాయకుడు కావడం వల్లే, అలాగే భవానిపూర్‌లో నేను మమతా బెనర్జీని ఓడించడం వల్లే అతను హత్యకు గురయ్యాడు. అతని హత్యకు ఇదే కారణం అయి ఉండవచ్చు, అని సువేందు అధికారి అన్నారు.

ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, నిందితులకు కఠిన శిక్ష పడాలని ఆ కుటుంబం కోరుకుంటోందని ఆ బీజేపీ నాయకుడు పేర్కొన్నారు.

నేను ఆయన కుటుంబానికి అండగా నిలుస్తాను. ఈ హత్యకు పాల్పడిన వారిని పట్టుకుని, వారికి శిక్ష పడేలా చూడటమే ఆ కుటుంబం చేస్తున్న డిమాండ్. ఆయనపై నాలుగు బుల్లెట్లు కాల్చినట్లు పోస్ట్‌మార్టం నివేదికలో తేలింది. ఈ హత్య పథకం ప్రకారం జరిగింది, అని ఆయన అన్నారు.కాల్పులకు పాల్పడే ముందు, రోజుల తరబడి రథ్ కదలికలను దాడి చేసినవారు నిశితంగా గమనించారని సువేందు అధికారి ఆరోపించారు.ఇది ఒక పథకం ప్రకారం జరిగిన ఆపరేషన్. దీని కోసం రోజుల తరబడి నిఘా నిర్వహించారు. బాధితుడిని వెంబడించి, ఆపై అతి సమీపం నుండి కాల్పులు జరిపారు, అని ఆయన పేర్కొన్నారు. ఈ దాడి వెనుక ఉద్దేశం తక్షణ మరణం కలిగించడమేనని వైద్య పరీక్షల ఫలితాలు సూచిస్తున్నాయని ఆయన తెలిపారు. రథ్‌కు ఎటువంటి నేర చరిత్ర గానీ, తెలిసిన వ్యక్తిగత వైరం గానీ లేదని సువేందు అధికారి స్పష్టం చేశారు.అతనికి ఎటువంటి నేర చరిత్ర లేదు, రాజకీయ వైరుధ్యాలు కూడా లేవు. అతని ఏకైక గుర్తింపు ఏమిటంటే, అతను నాతో కలిసి పనిచేశాడు, అని ఆయన అన్నారు. రథ్ కుటుంబానికి తాను వ్యక్తిగతంగా అండగా ఉంటానని, వారికి న్యాయం జరిగేలా చూసే ప్రయత్నాలను స్వయంగా పర్యవేక్షిస్తానని ఆ బీజేపీ నాయకుడు తెలిపారు.అతని కుమార్తె, భార్య న్యాయం జరిగేలా చూడటం నా కర్తవ్యం, బాధ్యత. ఈ హంతకులను వీలైనంత త్వరగా అరెస్టు చేసి, అభియోగపత్రం దాఖలు చేసి, వారికి మరణశిక్ష పడేలా చూడటమే ఆ కుటుంబం ప్రధాన డిమాండ్, అని ఆయన పేర్కొన్నారు.

# లేబర్ కోడ్ పరిధిలోని కార్మికుల కోసందేశవ్యాప్తంగా వైద్య పరీక్షల నిర్వహణ

వుదయం డెస్క్, మే 7:

నలభై, అంతకంటే ఎక్కువ వయసున్న కార్మికులందరి కోసం దేశవ్యాప్త వార్షిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని ఢిల్లీ బసాయిదారాపూర్‌లోని ఈఎస్ఐసీ (ఈఎస్ఐసీ) వైద్య కళాశాల, ఆసుపత్రి వేదికగా నేడు కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రారంభించారు. భారతీయ శ్రామిక శక్తికి వృత్తిపరమైన ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రతను బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలక ప్రస్థానంగా నిలవనుంది.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులకు గౌరవం, సంక్షేమం, సామాజిక భద్రతను కల్పించాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హామీని నాలుగు కార్మిక చట్టాల అమలు ప్రతిబింబిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ''శ్రమ శక్తి'' గౌరవానికి అంకితమైన రోజుగా అభివర్ణిస్తూ.. కార్మికులందరికీ సామాజిక భద్రతా పరిధిని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా ఉపాధి కల్పన, సంక్షేమ చర్యల ద్వారా ''శ్రమ శక్తి'', ''యువ శక్తి''ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్రమంత్రి వెల్లడించారు.


దేశంలో సామాజిక భద్రత పరిధి గణనీయంగా విస్తరించిందని.. పదేళ్ల కిందట దాదాపు 30 కోట్లుగా ఉన్న లబ్ధిదారుల సంఖ్య నేడు సుమారు 94 కోట్లకు చేరిందని ఆయన వివరించారు. దీనివల్ల సామాజిక భద్రతా పరిధి 19 శాతం నుంచి 64 శాతానికి పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

అలాగే పదేళ్ల కిందట ఈఎస్ఐసీ లబ్ధిదారుల సంఖ్య దాదాపు 7 కోట్లు ఉండగా.. నేడు అది దాదాపు 15 కోట్లకు చేరిందని కేంద్రమంత్రి వెల్లడించారు.

కార్మికుల సంక్షేమం కోసం ఒక భారీ కార్యక్రమాన్ని ప్రకటిస్తూ.. ఇకపై దేశవ్యాప్తంగా 40 ఏళ్లు పైబడిన కార్మికులందరికీ ప్రతి సంవత్సరం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ మన్సుఖ్ మాండవీయ తెలిపారు.

ఆరోగ్య పరీక్షల ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించడం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలను నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరాల ద్వారా గుర్తించిన వ్యాధులకు అవసరమైన చికిత్స, మందులను ఈఎస్ఐసీ సౌకర్యాల ద్వారా అందజేస్తామని తెలిపారు.

నాలుగు కార్మిక చట్టాల కింద తీసుకొ




చ్చిన కీలక సంస్కరణల గురించి కేంద్రమంత్రి వివరిస్తూ.. పురుష, మహిళా కార్మికులు సమాన వేతనం పొందేలా నిబంధనలను చేర్చినట్లు చెప్పారు. అలాగే మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులను 12 వారాల నుంచి 26 వారాలకు పెంచామని పేర్కొన్నారు. మహిళల కోసం వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి వద్ద నుంచే పని) నిబంధనలను కూడా ఇందులో చేర్చామని చెప్పారు.

గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులను సామాజిక భద్రతా పరిధిలోకి తీసుకురావడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ఇంకా మార్గాలను అన్వేషిస్తుండగా.. ప్రధాని శ్రీ మోదీ ప్రభుత్వం కొత్త కార్మిక చట్టాల ద్వారా వారిని ముందస్తుగానే ఆ పరిధిలోకి చేర్చిందని తెలిపారు.

ప్రమాదకరమైన వృత్తుల్లో నిమగ్నమైన కార్మికులు, 10 మంది కంటే తక్కువ కార్మికులు ఉన్న సంస్థల్లో పనిచేసే ఉద్యోగులను కూడా ఇప్పుడు ఈఎస్ఐసీ పరిధిలోకి తీసుకువస్తున్నారని డాక్టర్ మాండవీయ తెలిపారు.

గతంలో కార్మికులు నిర్లక్ష్యానికి గురయ్యేవారని, వారి సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని.. కానీ ప్రస్తుత ప్రభుత్వం వారి ఆందోళనలను పూర్తి నిబద్ధతతో, సున్నితత్వంతో పరిష్కరిస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. దేశీయ శ్రామిక శక్తికి గౌరవాన్ని, రక్షణను, మెరుగైన ఆరోగ్య సంరక్షణను అందించే లక్ష్యంతో చేపట్టిన మరో ముఖ్యమైన ప్రయత్నమే ఈ దేశవ్యాప్త ఆరోగ్య తనిఖీ కార్యక్రమమని చెప్పారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం దేశవ్యాప్తంగా మరో 11 ప్రాంతాల్లోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) ఆసుపత్రుల్లో ఏకకాలంలో నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో రాష్ట్ర కార్మిక మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ సభ్యులు, ఉన్నతాధికారులు, యజమానుల ప్రతినిధులు, కార్మికులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఢిల్లీ ప్రభుత్వ న్యాయ, కార్మిక, ఉపాధి, అభివృద్ధి, కళా సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ కపిల్ మిశ్రా, ఈఎస్ఐసీ డైరెక్టర్ జనరల్ శ్రీ అశోక్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

# మంత్రులకు విధించిన మరణశిక్షలను నిలిపివేసిన చైనా

- అవినీతి కేసుల్లో దోషులుగా తేలిన ఇద్దరు మాజీ రక్షణ మంత్రులు

వుదయం, డెస్క్, మే 7:

అవినీతి నిర్మూలన దిశగా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చేపట్టిన తాజా చర్యల్లో భాగంగా, ఇద్దరు మాజీ రక్షణ మంత్రులకు ఒక చైనీస్ సైనిక న్యాయస్థానం గురువారం నాడు 'మరణశిక్షలనుస నిలిపివేసినట్టు ప్రభుత్వ మీడియా తెలిపింది.2012లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి షీ జిన్‌పింగ్ చేపట్టిన విస్తృత స్థాయి అవినీతి నిర్మూలన ఉద్యమంలో భాగంగా, ఉన్నత స్థాయి సైనిక అధికారులకు బీజింగ్ విధించిన అత్యంత కఠినమైన శిక్షలు ఇవే.

72 ఏళ్ల వీ ఫెంగ్‌హే మరియు 68 ఏళ్ల లీ షాంగ్‌ఫులకు విధించిన ఈ శిక్షలు, రెండేళ్ల గడువు అనంతరం జీవితకాల




ఖైదుగా మార్చనున్నట్టు ప్రభుత్వ వార్తా సంస్థ గ్జిన్హువా వెల్లడించింది.ఫెంగే.. 201823 మధ్యకాలంలో చైనా రక్షణశాఖ మంత్రిగా పనిచేశారు. అంతకుముందు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన అత్యంత కీలకమైన 'రాకెట్ ఫోర్స్'కు అధిపతిగా ఉన్నారు. ఆయన అనంతరం రక్షణశాఖ మంత్రిగా లీ షాంగ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవికి ఆయన్ను స్వయంగా జిన్‌పింగే ఎంపిక చేశారు. కానీ, ఏడాది తిరగకముందే తొలగించారు. అనంతరం షాంగ్ కొన్ని నెలలపాటు కనిపించకుండా పోయారు. 2024లో నే అధికార కమ్యూనిస్టు పార్టీ నుంచి ఈ ఇద్దరినీ బహిష్కరించారు.చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చిన అనంతరం పాలక కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (CPC).. భారీ అవినీతి నిరోధక ఉద్యమం చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటివరకు లక్షలాది మంది అధికారులపై చర్యలు తీసుకుంది. ఇందులో ఉన్నతస్థాయి సైనిక అధికారులు కూడా ఉన్నారు.

# ప్రజలు ఇచ్చిన బాధ్యత ప్రకారం ప్రతిపక్షంలో కూర్చుంటాం



తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతున్న నేపథ్యంలో, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పు మేరకు తాము ప్రతిపక్షంలో కూర్చుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఇచ్చిన బాధ్యతను గౌరవిస్తూ, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా పని చేయడమే తమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కే సంప్రదాయం డీఎంకేది కాదని అన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు కోసం ఇతర పార్టీల నుంచి ఎలాంటి ప్రతిపాదనలు వచ్చినా, పార్టీ తీసుకునే నిర్ణయానికి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కట్టుబడి ఉండాలని ఆదేశించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి ప్రజాప్రతినిధులు ఇతర పార్టీలకు మద్దతిచ్చే ప్రయత్నాలు చేయకూడదని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ ఐక్యత ఎంతో ముఖ్యమని ఆయన అన్నారు.తమిళనాడు అభివృద్ధిని కాంక్షించే వారు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రాజ్యాంగ సంక్షోభానికి ఎట్టి పరిస్థితుల్లో తావివ్వకూడదని అన్నారు. డీఎంకే ఎప్పుడూ ప్రజల వైపు ఉంటుందని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తామని హామీ ఇచ్చారు.అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించగా... డీఎంకే 59, అన్నాడీఎంకే 47 స్థానాలు గెలుచుకున్నాయి. తమిళనాడు అసెంబ్లీలో మొత్తం 234 స్థానాలు ఉండగా, ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 118. విజయ్ పార్టీకి ఇంకా ఎమ్మెల్యేల మద్దతు కావాల్సి ఉండడంతో... డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు చేతులు కలిపి, వారి మిత్ర పక్షాలను కలుపుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందంటూ కొన్ని కథనాలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే స్టాలిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## కలెక్టరేట్ భవన సుందరీకరణ పనుల పరిశీలన



**– జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.**

ములుగు,మే 07(వుదయం ప్రతినిధి): ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన చివరిదశ సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు. గురువారం ములుగు గట్టమ్మ వద్ద నిర్మిస్తున్న నూతన సమీకృత కలెక్టరేట్ భవన చివరి దశ సుందరీకరణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ జెండా, సమావేశపు గది,స్టేట్ బోర్డ్, ఛాంబర్,లిఫ్ట్, టాయిలెట్స్,గార్డెనింగ్ సుందరీకరణ పనులను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవనం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ ఈ ఈ శ్యామ్ సింగ్, ఏ ఈ, గుత్తేదారులు పాల్గొన్నారు.

## దేవరకొండలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



**నల్లగొండ,మే07(వుదయం):**

నల్గొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివ శంకర్ రెడ్డి దేవరకొండ బస్టాండ్ ప్రాంగణంలోని శివ గంగా ట్రేడర్స్, తిరునాల రోటరీ ఆయిల్ మిల్ మరియు నందిని సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సందర్భంగా చెల్లుబాటు అయ్యే ఫుడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు,
అలాగే 15 లీటర్ల టిన్ల నుంచి గానుగ యంత్రాల ద్వారా లూజ్ ఆయిల్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు.చర్యల్లో భాగంగా అనుమానాస్పదంగా ఉన్న మూడు ఆయిల్ నమూనాలను విశ్లేషణ కోసం సేకరించారు. అలాగే మంచి నాణ్యత కలిగిన వేరుశెనగలను మాత్రమే వినియోగించాలని, గానుగ కేంద్రాల్లో నాణ్యమైన ముడి పదార్థాలను ఉపయోగించాలని నిర్వాహకులకు సూచించారు.ప్రాంగణాలను పరిశుభ్రంగా నిర్వహించడంతో పాటు, ముడి పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయాలని అధికారులుఆదేశించారు. లూజ్ ఆయిల్స్ కొనుగోలు విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు

## ముగ్గురు గంజాయి నేరస్థుల అరెస్టు



**వుదయం సూర్యాపేట జిల్లా ప్రతినిధి: 07**

జిల్లాలో గంజాయి సేవించిన, అమ్మిన కఠినమైన చర్యలు ఉంటాయని ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని డియస్పి వి. ప్రసన్న కుమార్ అన్నారు. గురువారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సూర్యాపేట మండలం కుసుమవారి గూడెం గ్రామ శివారులోని ఇందిరమ్మ కాలనీ మూడో విడత సమీపంలో సూర్యాపేట రూరల్ ఎస్సై బాలు నాయక్ సిబ్బంది బుధవారం ఉదయం వాహనాలు తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్ పై వెళ్తూ వారిని చూసి తడబడుతూ అనుమానాస్పదంగా కనిపించడంతో వారి దగ్గరికి పోలీసులను వెళ్తుండడంతో పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకుని విచారించగా దేశగాని గణేష్,పశుల రాంచరణ్,పోతురాజు బన్నీ సీలేరు అనే ఊరికి వెళ్లి అక్కడ గంజాయిని కిలో రెండు వేల రూపాయల చొప్పున కొనుక్కొని వచ్చి కొంత అమ్మి కొంత తాగాలని నిర్ణయించుకున్నారని 10 గ్రాముల ఒక్కొక్క ప్యాకెట్ 1000 రూపాయలు చొప్పున సూర్యాపేట పట్టణంలోకి వెళ్లి కొత్త బస్టాండ్ చుట్టుపక్కన సమీపంలో అమ్ముటకు నిర్ణయించుకున్నారు. కానీ ఎవరు కొనకపోవడంతో మోటార్ సైకిల్ పై ముగ్గురు కలిసి కుసుమవారి గూడెం వస్తుండగా వారి వద్ద 1కేజీ 160 గ్రాముల గంజాయి ఒక మోటార్ సైకిల్ పట్టుబడి చేసి రిమాండ్ కు తరలించారు.జిల్లా ఎస్పీ నరసింహ ఉత్తర్వుల మేరకు డివిస్పి ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇంచార్జ్ సిఐ వెంకటయ్య, సూర్యాపేట రూరల్ ఎస్సై బాలు నాయక్, ఏఎస్ఐ వెంకన్న,రైటర్లు ఎండి అజ్గర్ అలీ,వీరస్వామి, సిబ్బంది ప్రతాప్ పాల్గొన్నారు.

## మూగ జీవాలను స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను అరెస్టు




**ఎస్ఐని అభినందించి నగదు రివార్డును అందజేసిన పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్.**

**ఖానాపురం, మే 7 (వుదయం ప్రతినిధి):**

ఈనెల 27న బక్రీద్ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రం శివారులోని హెచ్పి పెట్రోల్ పంపు సమీపంలోని ఎన్ హెచ్ 365 జాతీయ రహదారిపై పోలీస్ చెక్ పోస్ట్ ను జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాలనుసారం ఏర్పాటు చేసి మూగ జీవాలను వాహనాలలో అనుమానం రాకుండా స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన స్థానిక నూతన ఎస్ఐ జి.రామ్మోహన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తమ కార్యాలయంలో అభినందించి నగదు రివార్డును అందజేశారు. అనంతరం ఎస్ఐకి పోలీస్ కమిషనర్ శాంతిభద్రతలపై పలు సలహా సూచనలు చేశారు, ఈ సందర్భంగా నగదు రివార్డు అందుకున్న ఎస్ఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో పై అధికారుల సలహా సూచన మేరకు విధులు నిర్వహించడంతో నాకు ఈ గౌరవం నగదు రివార్డు దక్కిందని తెలుపుతూ, జిల్లా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా అందుకోవడం
సంతోషంగా ఉందని తెలుపుతూ కమిషనర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమం, రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**రైతులకు రుణమాఫీ, మద్దతు ధరలతో అండగా ప్రభుత్వం**
**ఇందిరమ్మ ఇండ్లతో ప్రతి అర్హుడికి గృహ కల్పన లక్ష్యం**
***నేలకొండపల్లి మండలంలోని గువ్వల గూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజాదర్బార్**



**ఖమ్మం వుదయం బ్యూరో/ నేలకొండపల్లి, మే 06:**

పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం నేలకొండపల్లి మండలం గువ్వల గూడెం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల దీవెనలతో ఏర్పడిన ప్రజాప్రభుత్వం గడచిన రెండు సంవత్సరాల నాలుగు నెలల కాలంలో పేద ప్రజలకు అండగా ఉంటూ, పేదల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. రైతు సంక్షేమంలో ఎక్కడ తగ్గకుండా, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన చేయడంలో దేశంలోనే అన్ని రాష్ట్రాల కంటే అధికంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మే నెలాఖరికి రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, వేల సంఖ్యలో దరఖాస్తులు అందాయని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం అధిక దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. .రాబోయే 35 రోజులలో సాదా బైనమా దరఖాస్తులు అర్హత మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజా దర్బార్ లో వచ్చిన న్యాయబద్ధమైన ప్రతి దరఖాస్తుకు గరిష్టంగా మూడు నెలలలో పరిష్కారం చూపుతామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రజాదర్బార్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లబ్ధిదారుల స్పందన:గువ్వలగూడెం గ్రామంకు చెందిన ఒంగోలు ఉష మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన తాను ఎంతో ఆనందంగా ఉన్నానన్నారు.

గత 10 సంవత్సరాల్లో ఇంత మంచి కార్యక్రమం జరగలేదని, ప్రభుత్వం చేసిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, పాల్గొన్నారు

## మంత్రి సీతక్కచే పురస్కారాలు అందుకున్న డీఆర్డీఏ అధికారులు




**ములుగు, మే 07 (వుదయం ప్రతినిధి) :**

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను అందించడంలో ములుగు జిల్లా అద్భుత ప్రగతిని కనబరిచింది. నిర్దేశించిన లక్ష్యాన్ని మించి 117 శాతం వృద్ధిని సాధించి, రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచినందుకు గాను ములుగు జిల్లాకు 'బెస్ట్ పెర్ఫార్మెన్స్' అవార్డు లభించింది. గురువారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గౌరవ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), సెర్ప్ సీఈఓ దివ్య చేతుల మీదుగా ఈ అవార్డును ములుగు జిల్లా బృందం అందుకుంది. జిల్లా ప్రగతి, జిల్లాలో గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం డీఆర్డీఏ విభాగం చేసిన కృషిని ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రత్యేకంగా అభినందించారు. బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీలో 117 శాతం సాధించడం ములుగు జిల్లా అధికారుల, సిబ్బంది పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు.ఈ ప్రతిష్టాత్మక అవార్డును ములుగు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చంద్రశేఖర్, ఏపీడీ శ్రీనివాస్, బ్యాంకు లింకేజీ డీపీఎం శ్రీనివాస్, ములుగు గట్టమ్మ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మ కలసి అందుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ..

జిల్లా కలెక్టర్ మార్గనిర్దేశనంలో, సిబ్బంది సమష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని, భవిష్యత్తులోనూ పేదరిక నిర్మూలనకు మరిన్ని నిరంతర కృషి చేస్తామని తెలిపారు.

## కాంట, రవాణా ఒకేసారి వేగంగా కావాలి

**సరిపడా సిబ్బందిని పెట్టుకోండి,**
**ప్రతీ కేంద్రంకి ట్రక్ కేటాయింపు**
**రవాణా సౌకర్యర్థం రైతులు తమ వాహనాలని కూడా వాడుకోవచ్చు**
**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ/లింగాల ఘనపూర్, మే 07(వుదయం ప్రతినిధి) :**

అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు, రవాణా వేగం గా జరగాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు లింగాల ఘనపూర్, నెల్లుట్ల, వనపర్తి,దేవరొప్పుల మండలం దరావత తండా, సీతారామ్ పూర్ గ్రామల లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఆకస్మికంగా పరిశీలించారుఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చింది.

.ఎంత మందికి టోకెన్ ఇచ్చారు. ఎంత కొనుగోలు చేసారు. లారీలు ఏ టైం కి వస్తున్నాయి.లోడింగ్, ఆన్ లోడింగ్ కి ఎంత టైమ్ పడుతుంది అని తదితర వివరాలను కలెక్టర్ కేంద్ర నిర్వాహకులని అడిగి తెలుసుకున్నారు లారీతో పాటు కేంద్ర నిర్వాహకులకి సంబందించిన వారు ఎవరైన ఒక్కరు తప్పకుండా ట్రక్ తో పాటు వెళ్లి మిల్లుల లో తొందరగా ఆన్ లోడ్ అయ్యేలా చూడాలన్నారు అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా రవాణా ఇంకా త్వరగా అయ్యేందుకు కొనుగోలు అయిన దాన్యాన్ని రైతులు తమ సొంత వాహనాలలో మిల్లు లకు తరలించుకునే అవకాశాన్ని కల్పించినట్లు కేంద్ర నిర్వాహకులకు కలెక్టర్ తెలిపారుఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు కేంద్రాలలో గాని మిల్లుల వద్ద గాని ఏమైనా సమస్య లు తలేత్తితే వెంటనే రాత పూర్వకంగా తమ దృష్టి కి తీసుకరావాలని వెంటనే తగు చర్యలు తీసుకుంటామని రైతులకు కలెక్టర్ సూచించారు సీతరాంపూర్ లోని మైనర్ ఇరిగేషన్ ట్యాంక్ వద్ద జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కలెక్టర్ పరిశీలించారు పెండింగ్ వర్క్స్ ఎం ఉన్నాయి అని అడిగి తెలుసుకోని.. కమ్యూనిటీ వర్క్స్ కి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు

ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలన్నారు పూడిక తీసిన మట్టి ని ఎక్కడికి తీసుకెళ్తున్నారు అని కలెక్టర్ అడగగా... అక్కడ ఉన్న రైతులు తమ పొలంలోకి వేసుకునేందుకు తీసుకెళ్తున్నట్టు తెలిపారు

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్



**జనగామ క్రైం/చిల్పూర్, మే 07 వుదయం ప్రతినిధి) :**

బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించి వారికి న్యాయం చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన వెస్ట్ జోన్ పరిధిలోని చిల్పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు,రౌడీషీటర్ల వివరాలనుక్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు.గ్రామ సందర్శనతో ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి స్థానిక శాంతిభద్రతలపై ఆరా తీయాలి.ట్రాఫిక్ అవగాహనతో రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామస్తుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి.కఠిన చర్యలు వల్ల అక్రమ ఇసుక రవాణా, పాఠశాలల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయదారులపై కఠినంగా వ్యవహరించాలి.ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ భీమ్ శర్మ, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

**బుగులు వేంకటేశ్వరుని దర్శించుకున్న సీపీ**

చిల్పూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝా స్థానిక బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. అర్చకులు ఆలయ విశిష్టతను, ప్రాముఖ్యతను సీపీకి వివరించారు.

## నంది పురస్కారం అందుకున్న ఇల్లందు ఉపాధ్యాయుడు సుందర్

**ఇల్లందు,మే 7,(ఉదయం)**

ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ఆనందో బ్రహ్మ సాంస్కృతిక సంస్థ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతి లో జరిగిన కార్యక్రమం లో మన ఇల్లందు కు చెందిన ఉపాధ్యాయులు కామల్ల సుందర్ కి నంది పురస్కారం వచ్చిన సందర్భంగా గురువారం



గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ వారిని సన్మానించడం జరిగింది..
ఈ కార్యక్రమంలో రంగనాథ్, జబ్బార్, గాజి , మునిగంటి శివ, పాల్గొన్నారు

## రైతు ఆదాయమే లక్ష్యం.. వ్యవసాయానికి కొత్త దిశ

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
**ఘనంగా ముగిసిన మూడు రోజుల మెగా రైతు మేళా**




**హనుమకొండ, మే 07 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

తెలంగాణ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ, రైతును సంక్షేమం నుండి ఆదాయ పెంపు దిశగా నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి మెగా రైతు మేళా గురువారం ముగిసింది. ఈ ముగింపు వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పలువురు ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 25 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసి దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలిపాం.
ఆయిల్ పామ్ సాగుకు వాతావరణ మార్పులను తట్టుకుని, అధిక లాభాల నిచ్చే ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి. సిద్దిపేటలో ఇప్పటికే ఆయిల్ పామ్ మిల్లును ఏర్పాటు చేశాం. భూసార రక్షణ, రసాయన ఎరువుల వాడకం తగ్గించి, భూసారాన్ని కాపాడుకోవాలి. ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లడం ద్వారా ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చు. దేశంలోనే మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. వరి, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నాం.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. కల్తీ ఆహార పదార్థాల కాలంలో సేంద్రియ, సహజ వ్యవసాయం ఆవశ్యకత పెరిగిందని అన్నారు. మహిళా రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారని, రైతులు అంతర పంటల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందాలని సూచించారు. ముగింపు వేడుకలో ఆకర్షణలు, ఆయిల్ పామ్ సాగులో ఉత్తమ దిగుబడి సాధించిన రైతులకు మంత్రుల చేతుల మీదుగా చెక్కుల పంపిణీ.లావణ్య రెడ్డి, భావన రెడ్డి వంటి ఆదర్శ మహిళా రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, సత్య శారద తదితర అధికారులు పాల్గొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యాంత్రీకరణను అందిపుచ్చుకుని, పంట మార్పిడి పద్ధతులు పాటిస్తే రైతు అప్పుల ఊబి నుంచి బయటపడి ఆర్థికంగా నిలదొక్కుకుంటారని సదస్సులో వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## సౌర విద్యుత్ పథకాలతో రైతులు ఆర్థికంగా లాభం

**వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద.**
**పీఎం కుసుం సూర్యఘర్ పథకాలపై రైతులకు అవగాహన సమావేశం.**



**వరంగల్ జిల్లా వుదయం ప్రతినిధి మే 7.**

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక (99 డేస్ యాక్షన్ ప్లాన్)లో భాగంగా నిర్వహిస్తున్న "రైతు వారం" కార్యక్రమంలో గురువారం ఫోర్ట్ వరంగల్ మండలంలోని ఈస్ట్ ఫోర్ట్‌లో రైతు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ టీ జి యన్ పి డి సి ఎల్ వరంగల్ మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కుసుం ఏ, పీఎం కుసుం సి మరియు పిఎం సూర్యఘర్ పథకాల ద్వారా రైతులు సౌర విద్యుత్ వినియోగాన్ని పెంపొందించుకుని ఆర్థికంగా లాభపడవచ్చని తెలిపారు. వ్యవసాయ పంపు సెట్లకు సౌర విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ వ్యయం తగ్గడమే కాకుండా అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసి రైతులు అదనపు ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని ఆమె వివరించారు. సౌర విద్యుత్ వినియోగం పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు మరియు వినియోగదారుల కోసం రూపొందించిన విద్యుత్ భద్రత అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. విద్యుత్ ప్రమాదాల నివారణలో భద్రతా నియమాల ప్రాముఖ్యతను వివరిస్తూ, విద్యుత్ లైన్ల సమీపంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, విద్యుత్ పరికరాలను సురక్షితంగా వినియోగించాలని సూచించారు. సమావేశంలో పి యం కుసుం పథకాల అమలు విధానం, సౌర వ్యవసాయ పంపు సెట్ల ప్రయోజనాలు, విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ భద్రత మరియు టీజి ఎన్పీడీసీఎల్ సేవలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి కె. అనురాధ, మండల వ్యవసాయ అధికారి జి. విజ్ఞాన్, డా. శ్రావణ్, డా. హరి, వరంగల్ సీనియర్ సైంటిస్టులు రైతులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. అధిక లాభాలనిచ్చే ఆయిల్ పామ్ సాగు, పంట మార్పిడి విధానాలు, నానో యూరియా వినియోగం, ఎరువుల సమతుల్య యాజమాన్యం, పారాక్వాట్ వంటి నిషేధిత మందుల దుష్ప్రభావాలు, వరి కోతల అనంతరం వ్యర్థాలను తగులబెట్టకుండా భూమిలోనే కుళ్ళింపజేసే పద్ధతులు, సన్న రకపు వరి సాగు మరియు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎం పీడీసీఎల్ ఆనందం, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, ఆర్ ఇ డి సి ఓ జనరల్ మేనేజర్ రాజేందర్, ఎన్పీడీసీఎల్ ఎస్సీ వరంగల్ ఆనందం, జెడి అగ్రికల్చర్ అనురాధ, డి.ఇ. వరంగల్ మల్లికార్జున్, ఏ డి ఈ వరంగల్ కిషోర్, ఏ యి ఫోర్ట్ వరంగల్ రామకృష్ణ, విద్యుత్ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను పూర్తి చేయాలి





**భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి**
**దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్**

**మహాదేవపూర్ మే 07 (వుదయం ప్రతినిధి)**

సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసి, భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. గురువారం కాళేశ్వరం వద్ద జరుగుతున్న అంత్య పుష్కరాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సరస్వతి ఘాట్‌ను సందర్శించి, ఘాట్‌లో వేస్తున్న పార్కింగ్ టైల్స్ పనులు, సరస్వతి విగ్రహం వద్ద ఏర్పాటు చేసే పగోడాలు, చలువ పందిళ్ల ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఘాట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ స్థలాలు, శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు, మద్దులపల్లి, పూసుకుపల్లి, బలిజాపూర్ మరియు గోదావరి వంతెన వద్ద ఏర్పాటు చేస్తున్న పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మ్యూజియం పనులను పరిశీలించి, ఈ నెల 18వ తేదీ నాటికి విగ్రహాల ప్రతిష్టాపన వాస్తు ప్రకారం పూర్తి చేయాలని సూచించారు.తదుపరి ఈఓ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఈనెల 21 నుండి జూన్ 1 వరకు నిర్వహించే సరస్వతి అంత్య పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని, గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రైవేట్ వాహనాలు మరియు ఆర్టీసీ బస్సులకు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేస్తూ, సుమారు 260 ఎకరాలలో 24 ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు..ఈ నెల 21వ తేదీ ఉదయం 5:43 గంటలకు కంచి స్వామివారు త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించనున్నారని, ఈ కార్యక్రమంలో ధార్మిక సలహాదారు గోవింద హరి,

అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఎఫ్‌వో నవీన్ రెడ్డి,ఈఓ మహేష్ మరియు పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ లో సభ్యత్వ నమోదును ప్రారంభించిన కలెక్టర్

**హనుమకొండ టౌన్, మే 07 (వుదయం ప్రతినిధి) :**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆదేశానుసారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా పరిధిలో ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమం హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంలో కలెక్టర్ మాట్లాడుతూ సమాజ సేవలో భాగస్వామ్యం కావాలనుకునే వారు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం పొందవచ్చు. సభ్యత్వం పొందదలచిన వారు సభ్యత్వ దరఖాస్తు ఫారం పూర్తి చేసి, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, స్థానిక ఆధార్ కార్డ్ ప్రతితో పాటు శాశ్వత సభ్యత్వ ఫీజు ₹1,150/ చెల్లించాలి. సమర్పించిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం, సభ్యత్వ ప్రక్రియ పూర్తి చేసి శాశ్వత సభ్యత్వం మంజూరు చేయబడుతుంది అని తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధ్యక్షతన రెడ్ క్రాస్ పాలకవర్గ సమావేశం




నిర్వహించారు. ఈ సమావేశం లో రెడ్ క్రాస్ ఆదాయం, వ్యయాలను సమీక్షించి, పాలకవర్గ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంలో కలెక్టర్ మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు

నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ పాలకవర్గం అభినందనీయమైన సేవలు అందిస్తున్నదని ప్రశంసించారు.ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సభ్యత్వం గురించి మరియు రెడ్ క్రాస్ సేవాకార్యక్రమాలు గురించి వివరించారు.
రెడ్ క్రాస్ పాలకవర్గం కలెక్టర్ కు పూల మొక్క అందించి, శాలువా తో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్: డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, కోశాధికారి శ్రీ బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు శ్రీ ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డా. హెచ్. సంధ్యారాణి, బిళ్ళ రమణ రెడ్డి, పాల్గొన్నారు.




# డ్రోన్‌ల వినియోగంపై రైతులకు అవగాహన

**లక్షెట్టిపేట్, మే 07, (వుదయం ప్రతినిధి)**

: ఆధునిక వ్యవసాయంతో యాంత్రీకరణకు ప్రత్యేక స్థానం ఉన్నదని వ్యవసాయ సంచాలకులు ఎం కృష్ణ అన్నారు. గురువారం రైతు వారోత్సవాల సందర్భంగా మండలంలోని వెంకట్రావుపేట రైతు వేదికలో డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... డ్రోన్‌లను కేవలం పురుగు మందుల పిచికారికి కాకుండా, ఎరువులు, విత్తనాలు వేయడానికి కూడా ఉపయోగించే విధంగా మార్పులు చేస్తున్నారన్నారు. అనంతరం రైతులకు డ్రోన్‌లను ఉపయోగించే పద్ధతి తీసుకోవాలిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయ అధికారి గోపి, జిల్లా ఆర్టీఏ నెంబర్ అంకతి శ్రీనివాస్, సర్పంచ్ నలిమేల రాజు, డిఈ, ఏ డి ఈ టీఎస్ ఎస్పీడీసీఎల్, టీఎస్ రెడ్ కో జిల్లా మేనేజర్, డివిజన్ అధికారులు, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో అన్నదాత కుదేలు

**ఆదిలాబాద్, మే 07, (వుదయం ప్రతినిధి)**

రబీ సీజన్ ముగింపు దశలో కురిసిన అకాల వర్షాలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. కోతలు పూర్తి చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన జొన్న, మొక్కజొన్న ధాన్యం వర్షానికి తడిసి ముద్దవడంతో అన్నదాతలు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. ప్రభుత్వం పంట కొనుగోళ్లు ఆలస్యం చేయడంతో మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలు, గ్రామాల వద్ద రహదారుల పక్కనే ధాన్యం నిల్వ చేయాల్సి రావడం రైతులకు ప్రకృతి మరోసారి పరీక్షగా మారింది.గురువారం మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో జిల్లాలోని పలు మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. తార్పాలిన్ కవర్లు లేకపోవడం, సరైన గోదాముల సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం నీటిలో నానిపోయి నాణ్యత కోల్పోయే పరిస్థితి నెలకొంది. పలుచోట్ల రైతులు వర్షంలోనే ధాన్యాన్ని కప్పేందుకు ప్రయత్నించినప్పటికీ వర్షం తీవ్రతకు పంటను రక్షించలేకపోయారు.

కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో రైతులు రోజుల తరబడి మార్కెట్ యార్డుల వద్దే ధాన్యాన్ని కాపాడుతూ గడిపినట్లు తెలిపారు. వర్షానికి తడిసిన ధాన్యం నాణ్యత తగ్గిపోవడంతో కొనుగోలు చేస్తారో లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, కార్మిక ఖర్చులతో అప్పుల్లో ఉన్న రైతులకు అకాల వర్షాలు మరింత భారంగా మారాయి.



వర్షాల కారణంగా తడిసిన ధాన్యం మొలకెత్తే పరిస్థితి ఏర్పడడంతో పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాకపోవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో రైతులు ధాన్యం కుప్పల వద్దే రాత్రింబవళ్లు కాపలా కాస్తూ గడిపిన దుస్థితి కనిపిస్తోంది.

**పంట కొనుగోళ్లలో నిర్లక్ష్యమే కారణం ఎమ్మెల్యే పాయల్ శంకర్**

రాష్ట్ర ప్రభుత్వం పంట కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేయడంతోనే రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయడం వల్లే అకాల వర్షాల కారణంగా మార్కెట్ యార్డుల్లో నిల్వ ఉంచిన పంటలు తడిసిపోతున్నాయని పేర్కొన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించేందుకు ఎమ్మెల్యే ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు అధైర్యపడవద్దని, పంట పూర్తిగా కొనుగోలు అయ్యే వరకు ప్రభుత్వం పై తనవంతుగా ఒత్తిడి తీసుకువస్తానని భరోసా కల్పించారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుంది, ఇప్పటికే కొనుగోలు చేసిన పంటకు చెల్లింపులు రైతుల ఖాతాల్లో ఎప్పుడు జమ చేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రబీ సీజన్‌లో పండించిన పంట విక్రయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ప్రభుత్వ అలసత్వమే కారణమని విమర్శించారు.

**తక్షణ సహాయం అందించాలి**

తడిసిన ధాన్యాన్ని తిరస్కరించకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు ప్రత్యేక పరిహారం ప్రకటించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి రైతులకు తక్షణ సహాయం అందించాలన్నారు.





# ఇళ్ల పట్టాలకై కలెక్టర్ కు వినతి పత్రం అందజేత

- **మున్సిపల్ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి- రాజా రమేష్**

**మంచిర్యాలరామకృష్ణాపూర్ మే 07 (వుదయం ప్రతినిధి)**

సింగరేణి ప్రాంతమైన రామకృష్ణాపూర్ ఏరియాలో జీవో నెంబర్ 76 ద్వారా సింగరేణి ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలకు ఇండ్ల పట్టాలు ఇప్పించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతి పత్రం అందించడం జరిగిందని క్యాతనపల్లి మునిసిపాలిటీ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి రాజా రమేష్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సింగరేణి ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలకు జిఓ నంబర్ 76 ద్వార ఇండ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల పట్టాల కార్యక్రమం నిలుపుదల చేసిందని అందులో భాగంగానే జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. మున్సిపాలిటీ కి ప్రభుత్వం నుండి, కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే నిధులను క్యాతనపల్లి మున్సిపాలిటీకి అందేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్ ను కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. చైర్ పర్సన్ వెంట కౌన్సిలర్లు శంకర్,స్వర్ణలత, శ్రీను, సీనియర్ నాయకులు రామిడి కుమార్, లక్ష్మీ కాంత్, మణి కుమార్ లు పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధతపై జిల్లా స్థాయి సమీక్ష




**కామారెడ్డి, మే 7 (వుదయం ప్రతినిధి):-**

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదల నివారణ, విపత్తు నిర్వహణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశాన్ని గురువారం నిర్వహించింది.

ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని, జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, వరదల సమయంలో సమర్థవంతమైన స్పందన, విపత్తు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు.వర్షాకాల సన్నద్ధతలో భాగంగా కామారెడ్డి జిల్లాలో 2026 మే 18న జిల్లా స్థాయి ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మున్సిపల్ పరిపాలన, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖలతో పాటు ఇతర అత్యవసర సేవల విభాగాలు పాల్గొంటాయి.

ఈ మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా శాఖల మధ్య సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన విధానాలు, ప్రజల తరలింపు ప్రక్రియ, రక్షణ చర్యలు, సహాయక కార్యక్రమాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, వరదల సమయంలో చేపట్టాల్సిన మొత్తం సన్నద్ధతను పరీక్షించనున్నారు. జిల్లా ప్రజలు ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహణ సమయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, ఇది ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే సన్నద్ధత కార్యక్రమం మాత్రమేనని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# దివ్యాంగులకు అండగా ఉంటాం

**రాజన్న సిరిసిల్ల, మే 06 (వుదయం ప్రతినిధి)**

దివ్యాంగులకు అండగా ఉంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ భరోసా ఇచ్చారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్ సీఎస్ఆర్ కింద దివ్యాంగులకు రూ. 83 లక్షల విలువైన 813 ఉపకరణాలు అందించగా, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సినారే కళామందిరంలో గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్స్, సుగమ్య కేన్, స్మార్ట్ ఫోన్, ఇతర పరికరాలు అందజేశారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందని, దివ్యాంగుల కోసం రూ. 1600 కోట్లు వెచ్చించిందని తెలిపారు. దివ్యాంగులకు ఇప్పటికే సహాయ పరికరాలు ఇచ్చామని, భవిష్యత్తులో అర్హులందరికీ ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఎంతో మంది దివ్యాంగులు ఆత్మ స్థైర్యం, మనోధైర్యంతో ఎందరో జీవితాల్లో






వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. దివ్యాంగులకు అందరూ మద్దతుగా ఉండాలని, వారిలో స్ఫూర్తి నింపాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం ఇస్తున్నామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగాలని, డ్రాప్ ఔట్ ఉండవద్దని తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ మేరకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ ఏడాది కూడా సైకిల్ లు ఇస్తామని, ఈ ఏడాది 15 వేలు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. దివ్యాంగులు సంక్షేమానికి కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులకు అభినందనలు తెలియజేశారు. ఉపకరణాలతో

**మరింత ముందుకు వెళ్లాలి**

శిబిరంలో పంపిణీ చేసే ఉపకరణాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకొని మరింత ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. సుగమ్య భారత్ ... స్వశక్త భారత్ లో భాగంగా దేశ నిర్మాణం, అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు జిల్లాలో ఆరు శిబిరాలు ఏర్పాటు చేశామని, వైద్య పరీక్షలు చేయించి అర్హులను గుర్తించామని తెలిపారు. ఈ ఉప కరణాలతో దివ్యాంగులకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ లో 10 మంది దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో యూ డీ ఐ డీ కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని, వైకల్య నిర్ధారణ పరీక్షలు ప్రతి నెలా చేయిస్తున్నామని తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేములవాడలో మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు హెల్ప్ డెస్క్, దివ్యాంగులకు వీల్ చైర్లు, సహాయం అందించామని గుర్తు చేశారు. సిరిసిల్లలోని డే కేర్ సెంటర్ లో సేవలను దివ్యాంగులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారాణి, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఐఓసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వినీత్ కౌల్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీఎస్ ఆర్ హెడ్ హైదరాబాద్ కైలాస్ కాంత్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జడ్పీ సీఈవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేరేళ్ల, చిన్నపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**రైతులకు మద్దతు ధర కల్పించడమే లక్ష్యం**
**పీఏసీఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి**
**ధర్మపురి,మే 07(వుదయం ప్రతినిధి):**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నేరేళ్ల,చిన్నపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్,మార్కెట్ కమిటీ చైర్మన్,చిలుముల లావణ్య,సర్పంచ్‌లు కాసరపు బాలగౌడ్,గట్టు శారద గంగా రాం లు పాల్గొని రిబ్బన్ కట్ చేసి ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మి నష్టపో వద్దని,ప్రభుత్వం కల్పించిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రైతులు 17% కంటే తక్కువ తేమ ఉండేలా చూసుకోవాలని,నాణ్యత ప్రమాణాల మేరకు ధాన్యం తీసుకురావాలని సూచించారు.ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం క్వింటాలుకు ఏగ్రేడ్ రకం 2,389/ రూ,సాధారణ రకం 2,369/ రూ. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షులు షేర్ల రాజేశం, డైరెక్టర్లు జజాల లక్ష్మీ, నూర లక్ష్మీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మెరుగు పరశురాం,తోట్ల రాజయ్య, మండల పార్టీ అధ్య క్షులు వేముల సుభాష్,ఎంఆర్ఓ భూమేశ్వర్,ఉప సర్పంచ్‌లు కాసరపు కొమురయ్య, చట్ల శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈఓ అయ్యోరీ రాజేష్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పంపిణీ



- **10వ వార్డులో గర్భిణులు, బాలింతలకు అవగాహన**

**కౌన్సిలర్ సంగి. ఆనంద్**
**ధర్మపురి,మే07(వుదయం ప్రతినిధి):**

చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని 10వ వార్డు కౌన్సిలర్ సంగి ఆనంద్ పిలుపునిచ్చారు. గురు వారం స్థానిక 10వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడు తూ తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని, అంగన్‌వాడీల ద్వారా అందుతు న్న పౌష్టికాహారాన్ని క్రమం తప్ప కుండా తీసుకోవాలని సూచించా రు.అనంతరం వార్డులోని గర్భిణు లు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాల ప్యాకెట్లు, కోడిగుడ్లు, పప్పులు, బెల్లం
నూనెలు, బాలామృతం
కురుకురే ప్యాకెట్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జరీనా సుల్తానా,లబ్ధిదారు లు పాల్గొన్నారు.

# అర్హు లందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

**జగిత్యాల మే 06 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల పట్టణ 1వ వార్డుకు చెందిన సంబు రాయలింగు లక్ష్మి దంపతులకు సంబు మల్లయ్య ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి సారంగాపూర్ మండల కొనాపూర్ గ్రామానికి చెందిన గుండా సత్తెమ్మ చిన్న మల్లయ్య ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై ఆర్పపల్లి గ్రామానికి చెందిన మామిడిపల్లి జయ గంగాచారి కుడుకల జలజ రాజా లింగారెడ్డి ల ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి చీర కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ



కార్యక్రమంలో కమిషనర్ సత్యప్రణవ్ మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కౌన్సిలర్ చెట్టే గంగాధర్ కోరే గంగమ్మల్లు ఎంపీడీవో సలీం స్థానిక సర్పంచులు సొల్లు సురేందర్ రమేష్ మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి రాజేందర్ రెడ్డి శేఖర్ గౌడ్ మాజీ పాక్స్ చైర్మన్ మల్లారెడ్డి సర్పంచులు బాస మహేష్ కొలపాక రాధ రాజు శేఖర్ బాపి రాజు నాయకులు మల్లేష్ రెడ్డి లక్ష్మణ్ గోపాల్ రాజేందర్ తిరుపతి రెడ్డి
మాణిక్య రావు నాంపల్లి చిన్నారెడ్డి కచు రాజమల్లు దయాల కిష్టయ్య వార్డు సభ్యులు గ్రామ మండల నాయకులు
తదితరులు పాల్గొన్నారు

# మంత్రి శ్రీధర్ బాబు చొరవతో తాడిచెర్లలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం – పనులు ప్రారంభించిన సర్పంచ్ బండి స్వామి**
**మల్హర్, మే 7,(వుదయం ప్రతినిధి)**

మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమవుతున్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో గ్రామపంచాయతీ నిధులు మంజూరు కావడంతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు

గ్రామంలోని రాగం అయిలయ్య ఇంటి నుండి హనుమాన్ సెంటర్ వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను తాడిచెర్ల గ్రామ సర్పంచ్ బండి స్వామి, ఉపసర్పంచ్ బొబ్బిలి రాజుతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ బండి స్వామి మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చెందాలని ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. తాడిచెర్ల గ్రామ అభివృద్ధికి మంత్రి సహకారం ఎల్లప్పుడూ ఉంటోందని ఆయన తెలిపారు.అలాగే గ్రామంలో పెండింగ్‌లో ఉన్న ఇతర అభివృద్ధి పనులను కూడా త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజాప్రతినిధులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దేవేంద్ర, శ్యామల, సారయ్య, అశోక్, పర్వాన్ బేగం, కామ బాబు, వన్నమ్మ, తిరుపతిరావు,
సంగీత, నిరంజన్ రావు, మహేందర్, చంద్రయ్య, రాజేశ్వరి పాల్గొన్నారు. నాయకులు పైడాకుల సమ్మయ్య, మాచర్ల మధు, కొత్తగొల్ల రాజయ్యతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

# ఆర్టీఏ కార్యాలయ నిర్మాణానికి నిధుల మంజూరు చేయండి

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం అందజేసిన జువ్వాడి కృష్ణారావు**
**కోరుట్ల మే 07 (వుదయం ప్రతినిధి)**

కోరుట్ల పట్టణంలో రోడ్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరుతూ గురువారం రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ను.కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు కలిసి వినతి పత్రాన్ని



అందజేశారు కోరుట్ల పట్టణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఈ కార్యాలయ నిర్మాణం కోసం అందుబాటులో ఉందని కావున తక్షణమే నిధులు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు నిధుల మంజూరుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించినట్లు జువ్వాడి కృష్ణారావు పత్రిక విలేకరులకు టెలిఫోన్ ద్వారా తెలియజేశారు నిధుల మంజూరు సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు

## ఆధునిక వైద్య పరికరాలను వినియోగించి మెరుగైన సేవలు అందించాలి

**పెద్దపల్లి, మే 07 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆసుపత్రికి కొత్తగా వచ్చిన సుమారు రూ.39 లక్షల విలువైన వైద్య పరికరాల ఏర్పాటు పూర్తయ్యిందని తెలిపారు. చిన్నపాటి సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వ విప్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ సుమారు వెయ్యి మంది ఓపీ రోగులు ఆసుపత్రికి వస్తున్నందున వారికి అవసరమైన అన్ని సేవలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫార్మసీ విభాగాన్ని పరిశీలించి మందుల లభ్యతపై ఆరా తీశారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్లిట్ ల్యాంప్, 90డి లెన్స్, సిఆర్మ్ మిషన్, యూరాలజీ పరికరాలు, స్పిరోమీటర్, ఆడియోమీటర్, ఫైబర్ ఆప్టిక్ లారింగోస్కోప్,

# ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సి ఈ ఓ వాసం వెంకటేశ్వర్ రెడ్డి

**సంగారెడ్డి, మే 06 (వుదయం ప్రతినిధి)**



భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉప్కమింగ్ స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ (SIR) కార్యక్రమాన్ని సమర్థవంతంగా, వేగవంతంగా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అడిషనల్ సి ఈ ఓ

డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఎస్ ఐ ఆర్ నమోదు ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ ఆర్ ఓ . రాజేందర్, ఏడు మంది ఏ ఈ ఆర్ ఓలు, బిఎల్‌వో సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు సీఈఓ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, 2025 ఓటరు జాబితాలోని అర్హులైన ప్రతి ఓటరును 2002 ఓటరు జాబితాతో అనుసంధానం చేసే ప్రక్రియను కచ్చితంగా పూర్తి చేయాలని సూచించారు.

ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మ్యాపింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండటం గమనించామని , బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి వేగవంతంగా మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియలో రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్ల సహకారం తీసుకోవాలని, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఓటర్లలో ఉప్కమింగ్ (SIR) కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు.మరణించిన, బహుళ నమోదులు ఉన్న, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అలాగే వీవీఐపీ, వీఐపీ ఓటర్ల వివరాలను కూడా గుర్తించాలని సూచించారు. ప్రతి అర్హత గల ఓటరు తమ వివరాలను మ్యాపింగ్ చేయించుకునేలా సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని పేర్కొంటూ, సంబంధిత ఏ ఈ ఆర్ ఓ లు యాక్షన్ ప్లాన్ ప్రకారం రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఈఆర్వో, ఏఈఆర్వోలు, బీఎల్‌వో సూపర్వైజర్లు, బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.





# శుభకార్యాల్లో పాల్గొన్న నిరంజన్ రెడ్డి

## పలు శుభకార్యాలకు హాజరైన మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, మే 7 (వుదయం ప్రతినిధి)**

వనపర్తి పట్టణం రాజనగరం ప్రాంతానికి చెందిన టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుద్దేటి రాములు కుమార్తె వివాహ ప్రధాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడగా, మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వధూవరులు సుఖశాంతులతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామానికి చెందిన చలుకుటి పల్లవి - పరమేశ్ రెడ్డి గార్ల ఆహ్వానం మేరకు వారి కుమారుడు రేవంత్ రెడ్డి మరియు కుమార్తె బిందు రెడ్డి చిన్నారుల పుట్టుచీర - పుట్టుపంచె కార్యక్రమం వనపర్తి పట్టణం రామ్‌నగర్, శారద కాలనీలోని పానుగంటి శారదమ్మ కళ్యాణ మండపంలో ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై చిన్నారులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు సుఖశాంతులతో, ఐశ్వర్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి అర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

## సమస్యల పరిష్కారమే ధ్యేయం

**తాండూర్ ,మే 07 ,(వుదయం ప్రతినిధి)**



వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాకులు చూసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సిములు పేర్కొన్నారు గురువారం తాండూరు మండల పరిధిలోని చెంగోల్, బెల్కటూర్, గ్రామాల వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎండ తీవ్రతను రైతులు దృష్టిలో పెట్టుకొని ఉదయం లేదా సాయంత్రము కొనుగోలు కేంద్రాలకు రావాలని సూచించారు ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తేవాలని పేర్కొన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు సంక్షేమ పార్టీ అని గుర్తు చేశారు రైతులకు సబ్సిడీపై యంత్రాలను ఇవ్వడానికి ప్రభుత్వం జూన్ నెలలో ప్రారంభిస్తామని ఎవరికైతే రైతులకు సబ్సిడీపై యంత్రాలు కావాలో వాళ్ళు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు వ్యవసాయ అధికారి దగ్గర నమోదు చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జర్నప్ప, ఉదయ్ భాస్కర్ రెడ్డి, రాజు, తులసి నాయక్, మాజీ తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జన్య నాగప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్ రెడ్డి రామచంద్రారెడ్డి,

రాము, డీసీఎంఎస్ కార్యాలయ సిబ్బంది సలాం పాషా, చిన్నయ్య. మజీద్ భాస్కర్ గ్రామ ఉపసర్పంచ్ ,సర్పంచ్ కొడుకు వెంకటేష్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు

# ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

## కార్పొరేట్ జూనియర్ కళాశాలల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

- షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ అధికారి నుశిత

**గద్వాల మే 07 (వుదయం ప్రతినిధి)**

202627 విద్య సంవత్సరమునకు రెప్యూటెడ్(కార్పోరేట్) జూనియర్ కళాశాలల స్కీం కొరకు జూనియర్ కళాశాలల నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తులు, ఎంపికైన కార్పొరేట్ జూనియర్ కళాశాలలలో ప్రభుత్వ సహకారంతో అర్హులైన విద్యార్థులు చదివేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నుషిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 27 విద్యా సంవత్సరమునకు ఫ్రెష్ మరియు రెన్యూవల్ గుర్తింపు పొందిన జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలను ఎంపిక చేయుటకు రెసిడెన్సియల్ వసతి కలిగి విద్యాబోధనలో ఉన్నత ప్రమాణాలు కలిగి ఐఐటి, ఏఐఈఈఈ, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలలో ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణత శాతము కల్గినటువంటి రెప్యూటెడ్ జూనియర్ కళాశాలల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల కళాశాలలు తమ కళాశాలల ఐదేళ్ల నుంచి ఇప్పటి వరకు సంబంధించిన అకడమిక్ ప్రొఫైల్తో పాటుగా ఈపాస్ వెబ్ సైట్ ఆన్ లైన్ లో తమ కళాశాలల

ఈ పాస్ యూజర్ ఐడి పాస్ వర్డ్ తో లాగిన్ అయి,epass.cgg.telangana.gov.in వెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. కళాశాలలు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి 11.05.2026 చివరి తేదీగా తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న కళాశాలల తనిఖీ తేదీ 14.05.2026, రిజిస్ట్రేషన్ చేసుకున్న కళాశాలల ఎంపిక తేదీ 18.05.2026 గా ఆమె పేర్కొన్నారు. అలాగే పదవ తరగతిలో 400కు పైగా

మార్కులు పొందిన అర్హులైన విద్యార్థులకు కార్పొరేట్ జూనియర్ కళాశాలల యందు 202627 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందుటకై వెబ్ సైట్ సూచించిన ధ్రువపత్రాలతో ఈనెల 20వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్ ఓపెన్ అవుతుందని, జూన్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10.06.2026వ తేదీన విద్యార్థులను ఆన్లైన్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని,విద్యార్థుల దృవపత్రముల తనిఖీ, కళాశాలల ఎంపిక 12.06.2026న జరుగుతుందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

# పశువైద్య శిబిరానికి రైతులు హాజరు కావాలి

**దౌల్తాబాద్, మే 7 (వుదయం):**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రైతు వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 8న దౌల్తాబాద్ ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి డా. పరుశురాం తెలిపారు.శుక్రవారం జరిగే ఈ కార్యక్రమంలో పశువులలో గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్స, ఆరోగ్య పరీక్షలు, నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అలాగే సబ్సిడీపై పశుగ్రాస విత్తనాల పంపిణీతో పాటు వేసవిలో పశువుల సంరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పాడి రైతులు, జీవాల పెంపకందారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# గీతం డీమ్డ్ వర్సిటీ

## మానవీయ, సాంఘిక శాస్త్ర ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- మానవీయ, సాంఘిక శాస్త్రాల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న గీతం

**పటాన్చెరు మే 07 (వుదయం ప్రతినిధి)**




గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 202627 విద్యా సంవత్సరానికి గాను మానవీయ, సాంఘిక శాస్త్రాలలో యూజీ, పీజీ, పీహెచ్.డీ. కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని ఆ స్కూల్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. జాతీయ లేదా రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలలో పొందిన చెల్లుబాటు అయ్యే స్కోర్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, అలాగే గీతం ప్రవేశ పరీక్ష (గాట్ 2026) ద్వారా కూడా అర్హత సాధించవచ్చని ఆయన తెలియజేశారు. మూడో దశ ప్రవేశ పరీక్ష ఈనెల 17న జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 14వ తేదీలోగా అధికారిక పోర్టల్ ద్వారా ఆన్ లైన్లో సమర్పించవచ్చన్నారు. యూజీ స్థాయిలో సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జర్నలిజం అండ్ మీడియా స్టడీస్, సోషియాలజీ, సినిమాటిక్ ఆర్ట్స్ అండ్ డిజైన్లు ప్రధాన అంశం (మేజర్)గా బీ.ఏ. కోర్సును అందజేస్తున్నామని తెలిపారు. వీటిలో చేరిన విద్యార్థులకు వారు ఎంచుకున్న విభాగాలలో బలమైన పునాదిని అందించడంతో పాటు, వారి విశ్లేషణాత్మక, సృజనాత్మక, భావ ప్రకటనా నైపుణ్యాలను మెరుగుపరిచేలా ఆయా కోర్సులను రూపొందించామని తెలిపారు. లిబరల్ ఎడ్యుకేషన్ లో భాగంగా, విద్యార్థుల ఆసక్తి, ఆశయాల ఆధారంగా 600కు పైగా సబ్జెక్టుల కలయికలను ఎంచుకోవచ్చన్నారు.పీజీ స్థాయిలో అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషులలో ఎం.ఏ. కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఇవి ఉన్నతమైన సైద్ధాంతిక పరిజ్ఞానం, పరిశోధనా సామర్థ్యాలు, ఆచరణాత్మక అనువర్తనాలపై దృష్టి పెడతాయన్నారు.ఇక డాక్టోరల్ కోర్సులలో అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్, సోషియాలజీలలో పీహెచ్.డీ. కోర్సులు ఉన్నాయని ఆయన తెలియజేశారు. ఈ రంగాలలో ఉన్నతనాణ్యత గల పరిశోధన, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడమే వీటి లక్ష్యమన్నారు.విద్యతో పాటు క్రీడలు, ఇతరత్రా కార్యకలాపాలు, సామాజిక పరస్పర చర్యలతో అనుసంధానించడం ద్వారా సంపూర్ణ విద్యకు జీఎస్ హెచ్ఎస్ ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ శామ్యూల్ వివరించారు. అత్యాధునిక బోధనా విజ్ఞానవంతమైన దృక్పథాలు, విమర్శనాత్మక ఆలోచనల ద్వారా సమాజానికి అర్థవంతంగా దోహదపడేలా వారికి సాధికారత కల్పించడానికి గీతం కట్టుబడి ఉందన్నారు.గీతంలోని దాదాపు 33 శాతం మంది విద్యార్థులు ప్రతిభ ఆధారిత ఉపకార వేతనాలు పొందుతున్నారని, వీటిలో బోధనా రుసుము, భోజనం, వసతి ఖర్చులతో సహా పూర్తి మి న హా యిం పు లు న్నా య ని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకుని, మే 17న జరిగే ప్రవేశ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇతరత్రా సమాచారం కోసం www.gitam.edu ను సందర్శించాలని, లేదా 888 4984 000 ను సంప్రదించాలని సూచించారు.

# సీఏఐఐహెచ్ఎం సాంస్కృతిక సంబరాలు

- విద్యార్థుల ప్రతిభకు వేదికగా టీజీఎస్ఆర్టీసీ కళాభవన్ కళకళ

**ముషీరాబాద్, మే 07 (వుదయం):**




హైదరాబాద్ బల్కంపేట్ క్యాంపస్‌కు చెందిన చెన్నైస్ అమృత ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (సీఏఐఐహెచ్ఎం) ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లిలోని టీజీఎస్ఆర్టీసీ కళాభవన్ ఆడిటోరియంలో గురువారం ఘనంగా సాంస్కృతిక ఉత్సవం నిర్వహించారు. విద్యార్థుల కళాత్మక ప్రదర్శనలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే ఆడిటోరియం విద్యార్థుల సందడి, ఉత్సాహంతో కళకళలాడింది.

హాస్పిటాలిటీ, ఏవియేషన్, నర్సింగ్ రంగాల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ 16 ఏళ్లుగా విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన సీఏఐఐహెచ్ఎం... దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా విదేశాల్లో కూడా వేలాది మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ముందంజలో కొనసాగుతోంది. హైదరాబాద్‌లో బల్కంపేట్, ఖైరతాబాద్ క్యాంపస్‌లతో పాటు చెన్నై, బెంగళూరు, విజయవాడ నగరాల్లో కూడా విద్యాసంస్థలను విజయవంతంగా నిర్వహిస్తోంది.

ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు.

సంగీతం, నృత్యాలు, ఫ్యాషన్ ప్రదర్శనలు, థీమ్ పెర్ఫార్మెన్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు, అతిథులు విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

ఈ ఉత్సవం కేవలం వినోద కార్యక్రమంగా మాత్రమే కాకుండా... విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికగా, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించే కార్యక్రమంగా నిలిచింది.

విద్యార్థులు, తల్లిదండ్రులు సంస్థ ప్రతినిధులతో మమేకమై కోర్సులు, ప్లేస్‌మెంట్లు, అంతర్జాతీయ అవకాశాలపై ప్రత్యేక సమాచారం తెలుసుకున్నారు.

"విద్యతో పాటు ప్రతిభకు ప్రాధాన్యం" అనే సందేశాన్ని మరోసారి చాటిచెప్పిన సీఏఐఐహెచ్ఎం... భవిష్యత్ యువతకు మార్గదర్శక సంస్థగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# చేనేత సంఘాల ఓటర్ల జాబితాపై అభ్యంతరాల ఆహ్వానం

- నేటితో ముగియనున్న గడువు.. సహాయ సంచాలకుల వెల్లడి

**సిద్దిపేట, మే 07 (వుదయం ప్రతినిధి)**



సిద్దిపేట జిల్లాలోని 17 చేనేత సహకార సంఘాలకు నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా, ప్రాథమిక ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ జాబితాను సంబంధిత సంఘాల కార్యాలయాలతో పాటు, సిద్దిపేటలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని చేనేత మరియు జౌళి శాఖ కార్యాలయ నోటీసు బోర్డుపై ఈ నెల 6వ తేదీన ప్రదర్శించారు. ప్రకటించిన ఓటర్ల జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నా లేదా సవరణలు కోరినా, తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

సంబంధిత సంఘ కార్యాలయం లేదా సిద్దిపేటలోని సహాయ సంచాలకుల కార్యాలయం ఈ నెల 8వ తేదీ (శుక్రవారం) సభ్యత్వ ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు మరియు ఇతర మద్దతు పత్రాలు సమర్పించాలి అన్నారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత వచ్చే ఎటువంటి ఫిర్యాదులను లేదా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని చేనేత మరియు జౌళి శాఖ సహాయ సంచాలకులు స్పష్టం చేశారు. అర్హులైన సభ్యులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటర్ల జాబితాను సరిచూసుకోవాలని కోరారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది ఓటర్ల జాబితాను నిర్ణీత తేదీన ప్రకటిస్తామని వారు తెలిపారు.

# గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతో పాటు సంపాదన

- ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం

**గజ్వేల్, మే 07 (వుదయం ప్రతినిధి)**




గజ్వేల్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని "ముందు చదువు - తర్వాత ఉద్యోగం" అనే పాత పద్ధతికి స్వస్తి పలికి, "చదువుతో పాటు సంపాదన" అనే సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహం విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థినులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా, ఆసుపత్రులలో ప్రత్యక్ష శిక్షణ పొందుతూ వృత్తిపరమైన నైపుణ్యాలను పెం పొం దిం చు కో వ చ్చ ని వివరించారు.మూడేళ్ల కోర్సులో భాగంగా 40 శాతం వరకు పరిశ్రమల ఆధారిత శిక్షణ ఉంటుంది.చివరి ఏడాదిలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు మరియు ప్రముఖ ఆరోగ్య సంస్థలలో తప్పనిసరి శిక్షణ (అప్రెంటిస్‌షిప్) లభిస్తుంది. శిక్షణ కాలంలో విద్యార్థినులు నెలవారీ భత్యం (స్టైపెండ్) కూడా పొందుతారు.ఆసుపత్రి నిర్వహణ, ఈ కోర్సు పూర్తి చేసిన వారికి హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్, పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ వంటి ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు. 202627 విద్యా సంవత్సరానికి గానూ దోస్త్ (DOST) పోర్టల్ ద్వారా ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లోని విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశాల కోసం దోస్త్ పోర్టల్‌లో కళాశాల కోడ్ 16029ను ఎంచుకోవాలని ఆమె సూచించారు.



# రేవల్లీ లో రైతు వారోత్సవాలు

**ఊర్కొండ మే 07 (వుదయం ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజు రేవల్లీ రైతు వేదిక నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో రైతు వారోత్సవాల లో భాగంగా 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర చెందిన ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి గారు మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్ పల్లవి గారు గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ 6 అంశాలపైన రైతులకు సాగుకు ముందు అవగాహన కల్పించారు అందులో ముఖ్యంగా యూరియా వాడకం తగ్గించాలి ,నేలను సంరక్షించాలి అదేవిధంగా నాణ్యమైన విత్తనాలను అలాగే మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను వాడాలి. సేంద్రీయ వ్యవసాయం పైన అవగాహన, మరియు పంట మార్పిడి సుస్థిర వ్యవసాయం సాగునీటి ఆదా చేయడం భవిష్యత్తరాలకు మేలు. అవసరం మేరకు రసాయనిక ఎరువులు వాడకం పై అవగాహన కల్పించడం జరిగింది .AE ఎలక్ట్రిసిటీ ఊర్కొండపేట సాయన్న పీఎం కుసుమ , సోలార్ విద్యుత్ మీద అవగాహన కల్పించారు, వెటరినరీ డాక్టర్ రాజేష్ గాలికంటూ వ్యాధి టీకా గురించి మరియు రైతులకు రాబోయే కొన్ని రోజులో sexed సెమెన్ అందుబాటులోకి వస్తుంది అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రైతులు అడిగిన సందేహాలకు ప్రొఫెసర్ లు మరియు AE ఎలక్ట్రిసిటీ సమాధానాలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీప్తి , వెటర్నరీ డాక్టర్ రాజేష్ , రేవల్లీ గ్రామ సర్పంచ్ మరియు ఉపసర్పంచ్ సర్పంచ్ ,అన్ని క్లస్టర్ ల AEO లు,

గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, మే 07 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో వరి ధాన్యం కొనుగోళ్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే ట్రక్ షీట్లు జెనరేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు.మిల్లర్లు కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని ఖచ్చితంగా దింపుకోవాలని, ధాన్యం స్వీకరించిన అనంతరం మిల్లర్ల నుండి అకనాలెడ్జ్‌మెంట్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడినన్ని తేమ శాతం కొలిచే యంత్రాలు, గన్ని బ్యాగులు, తార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.రైతులకు నిర్ణీత గడువులోగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లలో ఎలాంటి జాప్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంగీత, జిల్లా పౌరసరఫరాల అధికారి, డిఎం సివిల్ సప్లై, డి ఆర్ డి ఓ, మార్క్ఫెడ్,జిల్లా సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి



**నారాయణపేట మే6 (వుదయం ప్రతినిధి)**

రైతులు సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని నారాయణపేట చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ లక్ష్మీపతి గౌడ్ సూచించారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో గురువా రం లక్ష్మీపురం, చిన్నజట్రం గ్రామలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ విజ్ఞాన సదస్సుకు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ హాజరైన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతు లేకపోతే దేశం లేదు అంటారు. వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదు, ఇది ఒక సంస్కృతి, జీవన విధానం అన్నారు. మనకు కావాల్సిన ఆహారాన్ని అందించేది వ్యవసాయమే. రైతులు తమ పంట పొలాల యొక్క భూసార పరీక్షలు చేయించుకొని, పంటల బీమా చేయించి, నష్టాలను అధిగమించవచ్చని తెలి పారు. నిత్యవసర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపరచుకంటే నష్ట పరిహారం పొందే వెసలుబా టు ఉంటుందని చెప్పారు. బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని తెలి పారు. పిల్లలకు చిన్నతనం నుండి మంచి రక్షణ మరియు విద్యావకాశాలు కల్పిస్తే, వారి భవిష్యత్తు (దేశ భవిష్యత్తు) సురక్షితంగా ఉంటుంది అని అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి భానుచందర్ ,సర్పంచ్ మమత , పంచాయితీ కార్యదర్శి సుజాత, సర్పంచ్ జ్యోతి,కానిస్టేబుల్ శ్యామప్ప,

గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# టీటీడీ ప్రాణదాన ట్రస్ట్ కు భారీ విరాళం

కోల్‌కతాకు చెందిన హిమాద్రి ఫౌండేషన్ రూ. 2.50 కోట్లు విరాళంపేద రోగుల వైద్య సేవలకు ఈ నిధులు ఉపయోగపడతాయన్న టీటీడీ ఛైర్మన్తిరుమలలో ఛైర్మన్ బీఆర్ నాయుడుకు డీడీని అందజేసిన ఫౌండేషన్ ట్రస్టీతిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు భారీ విరాళం అందింది. కోల్‌కతాకు చెందిన హిమాద్రి ఫౌండేషన్ సంస్థ రూ. 2.50 కోట్లను విరాళంగా అందజేసింది. తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో నిన్న ఈ కార్యక్రమం జరిగింది. హిమాద్రి ఫౌండేషన్ ట్రస్టీ అనురాగ్ చౌదరి, ఈ విరాళానికి సంబంధించిన రూ. 2.50 కోట్ల డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)ను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# వుదయం సినిమా

MOVIE TIME!

## జర్నలిస్టులు నిజాయితీగా
# ఆపరేషన్ అరుణారెడ్డి

ప్రముఖ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తూ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా "ఆపరేషన్ అరుణారెడ్డి". ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, పాటలు, ఎడిటింగ్ బాధ్యతలు కూడా పోసాని కృష్ణమురళి వహిస్తుండటం విశేషం. హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, ఆయేషా ఖాన్, బీజేపీ నేత రఘునందన్ రావు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్ లో జరిగిన ప్రెస్ మీట్ లో "ఆపరేషన్ అరుణారెడ్డి" చిత్ర విశేషాలు తెలిపారు దర్శక నిర్మాత నటుడు పోసాని కృష్ణమురళి.



# పవర్ పేట
## పవర్‌ఫుల్ గ్లింప్స్ రిలీజ్



విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నేతృత్వంలోని ప్రముఖ బ్యానర్ 70mm ఎంటర్‌టైన్‌మెంట్స్ మరో క్రేజీ ప్రాజెక్ట్ తో రాబోతుంది. బలమైన కథనంతో కూడిన సినిమాలకు మద్దతు ఇవ్వడంలో పేరు పొందిన ఈ నిర్మాణ సంస్థ తన తదుపరి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించింది. సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తుండగా, రచయిత నుంచి దర్శకుడిగా మారిన కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పుట్టినరోజు సందర్భంగా, పవర్‌పేట చిత్ర నిర్మాతలు ఆకట్టుకునే గ్లింప్స్ ను విడుదల చేశారు.

ఈ గ్లింప్స్ థియేటర్‌లో ఫస్ట్ డే ఫస్ట్ షో హంగామాతో హై వోల్టేజ్ మూడ్‌లో ప్రారంభమవుతుంది. అభిమానుల అరుపులు, సంబరాల మధ్య హీరో ఎంట్రీ, సిగరెట్ తాగుతూ సింహం గురించి పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పడం అలరించింది ఆ తర్వాత ఆ నేల స్వభావం, దానికి శక్తినిచ్చే మనుషుల గురించి చెబుతూ తన పాత్ర ఇంటెన్స్ చూపించారు. థియేటర్ స్క్రీన్‌పై బాణాసంచా విసిరే సీన్‌తో గ్లింప్స్ మరింత మాస్ ఫీల్‌ను అందించింది.
సందీప్ కిషన్ ఈ సినిమాలో రగ్డ్ పీరియాడిక్ అవతార్‌లో కనిపించారు. స్టైలిష్ షేడ్స్, కలర్‌ఫుల్ కాస్ట్యూమ్స్, రా అటిట్యూడ్‌తో ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. 'సేనాపతి రవి' అనే పాత్ర పేరును రివీల్ చేయడం ద్వారా ఆ క్యారెక్టర్‌లోని డామినేషన్, ఇంటెన్సిటీని సూచించారు. సందీప్ స్క్రీన్ ప్రెజెన్స్, పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# I Am Game
## 2026 ఆగస్టులో రిలీజ్

దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'ఐ యామ్ గేమ్' ప్రస్తుతం ప్రేక్షకుల్లో భారీ అంచనాలు క్రియేట్ చేస్తున్న చిత్రాల్లో ఒకటిగా మారింది. దక్షిణ భారతదేశంలోని 100కి పైగా లొకేషన్లలో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. తాజాగా దుల్కర్ సల్మాన్ ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. తన కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన సినిమాల్లో "ఐ యామ్ గేమ్"నే అత్యంత స్టైలిష్ ఫిల్మ్ అని తెలిపారు. సినిమాలో తన పాత్రతో పాటు మొత్తం వరల్డ్‌ని చాలా మోడర్న్, స్టైలిష్‌గా డిజైన్ చేశారని చెప్పారు. దర్శకుడు నహాస్ హిదాయత్ ప్రత్యేకంగా తనని ఓ కొత్త స్టైలిష్ అవతార్‌లో చూపించాలని భావించారని, అదే ఈ ప్రాజెక్ట్‌కు హైలెట్ గా మారిందని తెలిపారు.
బ్లాక్‌బస్టర్ 'ఆర్‌డీఎక్స్' తర్వాత నహాస్ హిదాయత్ తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను 2026 ఆగస్టులో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ఈ చిత్రం, మలయాళ సినీ పరిశ్రమలో కూడా అత్యంత పెద్ద రిలీజ్‌లలో ఒకటిగా నిలవనుంది. వే ఫారర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. షహబాస్ రషీద్, ఆదర్శ్ సుకుమారన్ కథా రచన అందించారు. 'లోకా' వంటి మెగా బ్లాక్‌బస్టర్ తర్వాత వే ఫారర్ ఫిలిమ్స్ నుంచి వస్తున్న తదుపరి చిత్రం ఇదే. ఇటీవల తన సినిమాల్లో ఎక్కువగా వింటేజ్ లుక్స్‌లో కనిపించిన దుల్కర్, ఈసారి పూర్తిగా భిన్నమైన స్టైలిష్ మాస్ యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్నారు. ఇది ఆయన 40వ చిత్రం కావడం విశేషం. భారీ స్థాయిలో పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు.







# SK33
## స్పెషల్ పోస్టర్

'శంబాల' బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు యుగంధర్ ముని సందీప్ కిషన్‌తో ఓ ప్రాజెక్ట్ చేయబోతోన్న సంగతి తెలిసిందే. ఈ మూవీని షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్ అందరిలోనూ ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది. అడివికి రాజైన సింహం, తోడేలు మధ్య జరిగే పోటీలా ఈ సినిమాలో అడ్వంచర్స్ ఉంటాయని టీం హింట్ ఇచ్చింది. ఇక ఇప్పుడు సందీప్ కిషన్ బర్త్ డే సందర్భంగా మరో పోస్టర్‌ను రిలీజ్ చేశారు.
ఈ పోస్టర్‌లోని ఓ బిడ్డ, ఖడ్గం, సింహం ఇవన్నీ చూస్తుంటే ఇదొక ఫారెస్ట్ అడ్వంచర్ చిత్రం అని అర్థం అవుతోంది. ఇక ఇందులో సింహంలాంటి యోధుడిగా సందీప్ కిషన్ కనిపిస్తాడని తెలుస్తోంది. ఏ లెజెండ్ ఈజ్ బార్న్ అంటూ వదిలిన ఈ పోస్టర్ ఆడియెన్స్‌లో ఒక్కసారిగా అంచాల్ని రెట్టింపు చేసింది. ఈ ఫాంటసీ అడ్వంచర్‌ను తెలుగు, హిందీ, తమిళ భాషల్లో రిలీజ్ చేయనున్న సంగతి తెలిసిందే.
ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరగుతున్నాయి. ఆగస్ట్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుందని గతంలోనే ప్రకటించారు. ఇక సందీప్ కిషన్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ అయితే అందరినీ ఆకట్టుకుంటోంది.

# పెద్ది ఫైనల్ ఎడిట్ లాక్డ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది'తో వెండితెరపై సంచలనం సృష్టించడానికి సిద్ధమవుతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత దర్శకుడు బుచ్చి బాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటైన 'పెద్ది' ఫైనల్ ఎడిట్‌ను మేకర్స్ లాక్ చేశారు. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ఫైనల్ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. షార్ప్, ఎమోషనల్ డెప్త్ తీసుకురావడంలో పేరుపొందిన జాతీయ అవార్డు గ్రహీత, ఎడిటర్ నవీన్ నూలి ఈ చిత్రానికి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. బుచ్చి బాబు సానా గ్రేట్ విజన్ తో 'పెద్ది' ఎమోషన్, యాక్షన్, గ్రాండియర్ తో నిండిన ఒక భారీ సినిమాటిక్ అనుభూతిని అందించబోతుంది. ఈ సినిమా కోసం రామ్ చరణ్ కంప్లీట్ గా ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌లో ఆయన మేకోవర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.
టెక్నికల్‌గా 'పెద్ది' అత్యున్నత స్థాయిలో తెరకెక్కుతోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు.



# దేత్తడి ప్రారంభం



రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన యంగ్ ట్యాలెంటెడ్ ఆశిష్ హీరోగా, సక్సెస్‌ఫుల్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి'. ఈ ప్రాజెక్ట్ తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ సెకండ్ షూటింగ్ షెడ్యూల్ ప్రారంభించారు. ఆశిష్ తో పాటు కీలక నటీనటులు ఈ షెడ్యూల్ లో పాల్గొంటున్నారు. "'దేత్తడి" సినిమాలో హై ఎమోషన్‌తో పాటు కొత్తగా చూపించే కల్చరర్ బ్యాక్‌డ్రాప్ స్టోరీ ఉండబోతోంది. ఆశిష్ పూర్తిగా మాస్ లుక్‌లో కనిపించడమే కాకుండా, ఒరిజినల్ హైదరాబాద్ స్లాంగ్‌లో డైలాగ్స్ చెప్పబోతున్నారు. ఈ సినిమాకు మ్యూజిక్ జునైద్ కుమార్ అందిస్తున్నారు. ప్రసన్న కుమార్ బెజవాడ స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌తో పాటు క్రియేటివ్ హెడ్‌గా కూడా పని చేస్తున్నారు.

# 22న పురుష



బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు 'పురుష:' సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్, టీజర్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్ లో ఇంట్రెస్ట్ ను క్రియేట్ చేశాయి.

## సంగీత ప్రియులకు మరపురాని సంగీత వేడుకగా నిలవనున్న
# టైమ్‌లెస్ విత్ సునీత ఉపద్రష్ట

వేదం ఆర్ట్ ఆధ్వర్యంలో జూన్ 13న, శిల్పకళావేదిక హైదరాబాద్‌లో సంగీత ప్రియులకు మరపురాని సంగీత వేడుకగా నిలవనున్న "టైమ్‌లెస్ విత్ సునీత ఉపద్రష్ట" కాన్సర్ట్‌కు సంబంధించిన మీడియా సమావేశం. ప్రముఖ గాయని సునీత ఉపద్రష్ట ముఖ్య అతిథిగా హాజరై మీడియాతో ముచ్చటించారు. కాన్సర్ట్ ప్రత్యేకతలు, సంగీత కాన్సెప్ట్, ప్రేక్షకులకు అందించబోయే అద్భుతమైన సంగీత అనుభూతి గురించి ఆమె ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ కాన్సర్ట్‌లో ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్న ప్రముఖ గాయకుడు శ్రీకృష్ణ మరియు ధనుజయ్ కూడా మీడియా సమావేశంలో పాల్గొని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.



# అగధ టీజర్‌లో చూపించని ఎన్నో అంశాలు ఉంటాయి
## టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఎం.ఎస్. రాజు


ఎం. ఎస్. రాజు రచన, దర్శకత్వం లో శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు 'అగధ' చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఏకకాలంలో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్, సిజ్జు , రోషన్, శ్రేయరాణి రెడ్డి తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. తాజాగా గురువారం నాడు ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు.



టాలీవుడ్‌లో 'మల్లెపూవు', 'మెంటల్ కృష్ణ', 'కలవరమాయే మదిలో' లాంటి విజయవంతమైన సినిమాలను నిర్మించిన అభిరుచిగల నిర్మాతగా పేరు తెచ్చుకున్న మోహన్ వడ్లపట్ల కొత్త సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అయితే ఈ సారి దర్శకునిగా మారారు. అమెరికన్ నటి జో శర్మ ప్రధాన పాత్రలో, దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సౌత్ ఇండియాలో పివిఆర్ ఇనోక్స్ పిక్చర్స్ నార్త్ ఇండియా లో జూవేల్ , ఓవర్సీస్ టెక్ ఫ్లెక్స్ ద్వారా విడుదలవుతున్న ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మోహన్ వడ్లపట్ల మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అమెరికాలో సీరియల్ కిల్లర్స్ కాన్సెప్ట్ చాలా ఫేమస్. "వాట్ ఈజ్ ద మోటివ్ బిహైండ్ దిస్ మర్డర్?" అని ఆలోచించినప్పుడు, "మోటివ్ ఫర్ మర్డర్" అని ఫిక్స్

# M4M పై నమ్మకంతోనే లక్షరూపాయల రివార్డు

అయ్యాం. దానికి షార్ట్ కట్ గానే "M4M" అని టైటిల్ పెట్టాం. ప్రతి సీన్ ని ఒక చిన్న సినిమా లాగా అంత కేర్ తీసుకొని చేశాను. స్క్రీన్ ప్లే చాలా జాగ్రత్తగా రాసుకున్నాను. చాలా ఫుటేజ్ ఉన్నా, దాన్ని క్రిస్ప్ గా ఎడిట్ చేసి హాలీవుడ్ స్టైల్ లో కేవలం 90 నిమిషాల సినిమాగా రెడీ చేశాం. ఇంటర్వెల్ కూడా అవసరం లేదు, కానీ మన వాళ్ళకి అలవాటు కాబట్టి ఒక ఇంటర్వెల్ బ్యాంగ్ పెట్టాం. ఒక క్లైమాక్స్ సీన్ లో మమ్మీ లాగా కట్టేసే సీన్ ఒకటి హాఫ్ డే పట్టింది, అది కొంచెం ఛాలెంజింగ్ గా అనిపించింది.



# నేను తెలుగు అబ్బాయినే పెళ్లి చేసుకుంటా

'పాపం ప్రతాప్' ఫేం పాయల్ రాధాకృష్ణ, 'ఈషా' ఫేమ్ త్రిగుణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాబ్జీ సమర్పణలో లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అరవింద్ మండెం నిర్మించారు. ఇందులో నుంచి ఇప్పటికే వచ్చిన టీజర్, ట్రైలర్, పాటలకు పాజిటివ్ రెస్పాన్స్ రాగా.. మే 15న సినిమా గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్‌కు రానుంది. ఈ క్రమంలోనే తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ తన పెళ్లిపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'నాకు నిజంగా తెలుగు అబ్బాయే కావాలి. నా హార్ట్, మైండ్ అంతా ఇక్కడే ఉన్నాయి. నేను నిజంగా హార్ట్ ఫుల్‌గా చెబుతున్నా నాకు వర్క్ ఇచ్చింది, ఫేస్ వ్యాల్యూ ఇచ్చింది, డబ్బుల ఇచ్చింది, పీస్ ఇచ్చింది, అన్నీ హైదరాబాద్, తెలుగు ఆడియన్సే. నాకు అన్నీ ఇక్కడే ఉన్నాయి. నేను లైఫ్‌లో చేసింది అంతా ఇక్కడే ఉంది. కాబట్టి నేను హైదరాబాద్‌ను, తెలుగును వదిలే ప్రసక్తే లేదు' అని చెప్పుకొచ్చింది.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.